

జడ్పీ బదిలీల్లో.. ఇష్టారాజ్యం

- వైసీపీకి అనుకూల ఉద్యోగులకు ప్రాధాన్యం
- ఎమ్మెల్యేల సిఫార్సులను పట్టించుకోని వైనం

- ఉనికిలో లేని జీవోల ఆధారంగా ఏవోల తిష్ఠ
- నరేంద్రకు వ్యతిరేకంగా పనిచేసిన అధికారికి అందలం
- 'నిమ్మగడ్డ'కు ఓటు ఇవ్వని వారికి పెదకాకాని పోస్టింగ్
- సీటుకు రేటు కట్టి మరీ వసూలు చేసిన ఓ అధికారి
- ఓ ఉద్యోగితో నగదు వసూలు చేయించినట్లు ఆరోపణలు

గుంటూరు సిటీ, సెప్టెంబరు 24: వైసీపీ అనుకూల ఉద్యోగులకు అందలం.. అడిగినంత ఇచ్చిన వారికి ప్రాధాన్యం.. ఎమ్మెల్యేల సిఫార్సులకు దక్కని గౌరవం.. ఇదీ తాజాగా ఉమ్మడి గుంటూరు జడ్పీలో జరిగిన బదిలీల వ్యవహారం. బదిలీల్లో నిబంధనలకు తిలోదకాలు ఇచ్చినట్లు తెలుస్తోంది. కింది స్థాయి ఉద్యోగిని మధ్యవర్తిగా ఉంచి భారీగా నగదు వసూలు చేశారన్న ఆరోపణలున్నాయి. చివరకు టీడీపీ ఓటమి కోసం అహర్నిశలు శ్రమించిన వ్యక్తులకు ప్రధాన కార్యాలయంలో పోస్టింగ్‌లపై సర్వత్రా విస్మయం వ్యక్తమౌతుంది. కొందరు ఎమ్మెల్యేలు ఇచ్చిన సిఫార్సు లేఖలు బుట్టదాఖలు చేశారన్న విమర్శలున్నాయి. గోప్యంగా జరిగిన బదిలీల ప్రక్రియలో జాబితాలను మళ్లీమళ్లీ మార్చినట్లు సమాచారం. బదిలీల సమయంలో అప్పటివరకు దూరప్రాంతంలో పనిచేసిన ఉద్యోగులు, అధికారులు జిల్లా కేంద్రానికి దగ్గరకు రావడానికి ఇష్టపడతారు. జడ్పీ బదిలీల్లో మాత్రం అందుకు విరుద్ధంగా గడచిన ఐదేళ్ల నుంచి గుంటూరులో తిష్ఠ వేసిన వారికి మళ్లీ ఇక్కడే ఉండే అవకాశం దక్కింది. డిప్యూటీ సీఈవో కొందరు ఏవోల కోసం ఉనికిలో లేని జీవోలను బయటకు తెచ్చినట్లు చెబుతున్నారు. వాటి ఆధారంగానే నాడు వైసీపీకి కన్ను, కాళ్ళు, చెవుల్లా పనిచేసిన వ్యక్తులను మళ్లీ అందలం ఎక్కించినట్లు తెలుస్తోంది. గత ఎన్నికల్లో పెదాకాకాని ఇన్‌చార్జి ఎంపీడీవోగా ఉన్న ఓ అధికారి టీడీపీ అభ్యర్థిగా ఉన్న ధూళిపాళ్ల నరేంద్రకు వ్యతిరేకంగా పనిచేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. అప్పట్లో నరేంద్ర కూడా సదరు అధికారిపై ఫిర్యాదు చేశారు. ఈ బదిలీ లో ఆయనను జడ్పీ ప్రధాన కార్యాలయానికి తీసుకువచ్చారు. అందుకోసం రూ.2 లక్షలు చేతులు మారినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఎన్నికల మాజీ కమిషనర్ నిమ్మగడ్డ వెంకటేశ్వరరావుకు ఓటును ఓ తహసీల్దార్ తిరస్కరించారు. సదరు తహసీల్దారు భర్త జడ్పీలో ఏవోగా ఉన్నారు. ప్రస్తుత బదిలీలో ఆయనను జిల్లా కేంద్రానికి దగ్గరలోని పెదాకాకానికి మార్చారు. పెదాకాకానిలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న ఓ ఉద్యోగిని అక్కడే ఉంచమని ఎమ్మెల్యే నరేంద్ర



లేఖ ఇచ్చినా దానిని పట్టించుకోకుండా మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి పీఏగా పనిచేసిన వ్యక్తిని ఆ స్థానానికి బదిలీ చేశారు. పెదాకాకాని సీనియర్ అసిస్టెంట్ విషయంలోనూ అదే జరిగింది. సదరు ఉద్యోగి విభిన్న ప్రతిభావంతులైనా కనికరం లేని జడ్పీ అధికారులు ఎమ్మెల్యే లేఖను లెక్క చేయకుండా బదిలీ చేశారు. తాడికొండ ఎమ్మెల్యే ఫిరంగిపురంలో ఉన్న ఓ ఉద్యోగికి లేఖ ఇచ్చినా అమరావతికి పంపారు. ఎమ్మెల్యే నరేంద్ర సొంత గ్రామానికి చెందిన ఓ ల్యాబ్ అసిస్టెంట్‌ను కూడా ఇష్టానుసారంగా బదిలీ చేశారు. జడ్పీ కార్యాలయ ఏవోల బదిలీలకు సంబంధించి ప్రత్తిపాడు ఎమ్మెల్యే రామాంజనేయులు ఇచ్చిన లేఖలకు సరైన ప్రాధాన్యం దక్కలేదని సమాచారం. ఆయన పరిధిలోని గుంటూరు రూరల్ మండల పరిషత్ కార్యాలయానికి కూడా వైసీపీకి అనుకూలంగా ముద్ర పడిన ఓ అధికారిని బదిలీ చేశారు. ఈ పోస్టు కోసం ఎమ్మెల్యే ఇచ్చిన లేఖను బుట్టదాఖలు చేశారు.

ఏకాభిప్రాయంతో ఇచ్చినా పట్టించుకోలేదు..

జడ్పీ ఇన్‌చార్జి సీఈవోకు పలువురు సీనియర్ ఎమ్మెల్యేలు పలుమార్లు ఫోన్ చేసి తొమ్మిది మంది ఏవోల బదిలీ విషయంలో కీలకమైన సూచనలు చేసినట్లు సమాచారం. ఉమ్మడి జిల్లాకు చెందిన సీనియర్ ఎమ్మెల్యేలు మిగిలిన వారితో మాట్లాడి ఏకాభిప్రాయంతో ఓ జాబితా తయారు చేసి పంపారు. ఆ జాబితా కూడా ఇన్‌చార్జి సీఈవో పక్కన పెట్టేశారని బదిలీల జాబితాను చూస్తే అర్థమవుతుంది. ఓ సీనియర్ ఎమ్మెల్యే, లక్ష్మీనారాయణ అనే అధికారి కోసం ఫోన్ చేసినా ఆయనకు పోస్టింగ్ ఇవ్వలేదు. వైసీపీ భక్త బృందానికి ఆయా ప్రదేశాల్లో పోస్టింగ్ ఇచ్చేందుకు పలు కారణాలు చెప్పిన అధికారులు ఎమ్మెల్యేల మాటలను తుంగలో తొక్కేశారన్న విమర్శలున్నాయి.

ఎంత వస్తే అంత..

జడ్పీ బదిలీల వ్యహారమంతా అవినీతి మయమైందన్న ఆరోపణలున్నాయి. ప్రతి పోస్టుకి రేటు కట్టి వసూలు చేశారన్న ఆరోపణలున్నాయి. ఏవో పోస్టుకి ఒక రేటు, సీనియర్, జూనియర్ అసిస్టెంట్ పోస్టులకి మరో రేటు అన్న పద్ధతిలో బదిలీల ప్రక్రియ జరిగినట్లు సమాచారం. ఓ అధికారి వద్ద ఉన్న కింద స్థాయి ఉద్యోగి నగదు వసూలు చేసినట్లు తెలుస్తోంది. కొందరు ఉద్యోగులు ఈ సంభాషణలను ఆడియో, వీడియో రికార్డు కూడా చేసినట్లు తెలుస్తుంది. ఓ వ్యక్తి వద్ద బదిలీ కోసం రూ.3 లక్షలు పుచ్చుకున్నారని తెలిసింది. ఇదే ఉద్యోగి తాను పనిచేసే అధికారి పేరు చెప్పి చివరకు అటెండర్ల వద్ద కూడా రూ.30 వేల నుంచి రూ.50 వేల వరకు వసూలు చేసినట్లు సమాచారం. జడ్పీ చరిత్రలో బదిలీల వ్యవహారంలో ఎప్పుడూ జరగనంత గందరగోళం ఇప్పుడు జరిగినట్లు సమాచారం. వైసీపీకి అనుకూలం అన్న అధికారి ఈ బదిలీల్లో ప్రధాన పాత్ర పోషించడంతో మొత్తం ప్రక్రియ ఆరోపణలమయంగా మారింది.

పదవుల పండుగ


నందం అబద్ధయ్య


పిల్లి మాణిక్యాలరావు

- ఉమ్మడి గుంటూరుకు ప్రాధాన్యం
- పోరాడిన వారికి అధిష్ఠానం గుర్తింపు
- పిల్లి మాణిక్యాలరావుకు లిడ్‌కాప్ చైర్మన్
- పద్మశాలి కార్పొరేషన్ చైర్మన్‌గా అబద్ధయ్య

గుంటూరు, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం పలు కార్పొరేషన్ల పాలక మండళ్లను నియమించింది. తొలి విడతగా విడుదల చేసిన జాబితాలో ఉమ్మడి గుంటూరు జిల్లాకు చెందిన పలువురు నేతలు కీలక పదవులు పొందారు. కష్టకాలంలో పార్టీ కోసం పని చేసిన వారికి, సేవలందించిన వారికి అండగా నిలుస్తామని తాజా పదవుల ఎంపికతో చంద్రబాబు నేతల్లో భరోసా కల్పించారు. టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి పిల్లి మాణిక్యాలరావుకు లెదర్ ఇండస్ట్రీస్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్(లిడ్‌కాప్) చైర్మన్, టీడీపీ మంగళగిరి నియోజకవర్గ సమన్వయకర్త నందం అబద్ధయ్యకు ఆంధ్రప్రదేశ్ పద్మశాలీ సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్‌గా కూటమి ప్రభుత్వం ఎంపిక చేసింది. వీరితో పాటు పలువురు నేతలకు వివిధ కార్పొరేషన్లలో సభ్యులుగా కీలక బాధ్యతలు అప్పగించింది. ఏపీ సివిల్ సప్లైస్ కార్పొరేషన్ సభ్యులుగా గుంటూరు పశ్చిమ నియోజకవర్గానికి చెందిన రాయపాటి శైలజ, మంగళగిరికి చెందిన తోట పార్థసారథి, తెనాలికి చెందిన కేశన కోటేశ్వరరావులకు అవకాశం కల్పించింది. రాయపాటి శైలజ అమరావతి ఉద్యమంలో మహిళా నేతగా కీలక భూమిక పోషించగా, పార్థసారథి, కోటేశ్వరరావులు మంగళగిరి, తెనాలిలో కీలక బాధ్యతలు నిర్వహించారు. పద్మశాలీ కార్పొరేషన్‌లో సభ్యులుగా మంగళగిరికి చెందిన కందుల నాగార్జున, పర్వతం మధుసూదనరావు, తెనాలికి చెందిన జొన్నాదుల మహేశ్వరరావు, తాడికొండకు చెందిన బిట్రా వెంకట శివనారాయణ నియమితులయ్యారు. జనసేన పార్టీలో చేనేత వికాస విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా పర్వతం మధుసూదనరావు పని చేస్తున్నారు. ఏపీ పర్యాటక అభివృద్ధి కార్పొరేషన్ సభ్యుడిగా యడ్లపాడు మండలం ఉన్నవ గ్రామానికి చెందిన టీడీపీ నేత కుర్రా అప్పారావు నియమితులయ్యారు. ఏపీ అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ సభ్యులుగా గుంటూరు తూర్పు నియోజకవర్గానికి చెందిన దాసరి రాజా మాస్టారు, జనసేనకు చెందిన వడ్రాణం మార్కండేయబాబు నియమితులయ్యారు. దాసరి రాజా మాస్టారు గతంలో రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా బాధ్యతలు నిర్వహించారు.

అలుపెరుగని పోరాటాలే వరం..

అలుపెరుగని పోరాటాలే నేడు పిల్లి మాణిక్యాలరావుకు వరాలుగా మారాయి. ఆయన పోరాటాలను గుర్తించిన చంద్రబాబు లెదర్ ఇండస్ట్రీస్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పదవిని అప్పగించి గౌరవించారు. ప్రకాశం జిల్లా చీరాల మండలం కారంచేడు గ్రామానికి చెందిన దళిత కుటుంబంలో జన్మించిన మాణిక్యాలరావు 1986లో జరిగిన కారంచేడు ఘటనలో బాధితుడు. మందకృష్ణ మాదిగతో కలిసి ఎంఆర్పీఎస్ ఏర్పాటుకు శ్రీకారం చుట్టిన మొదలు ఈరోజు వరకూ 25 ఏళ్ల సుదీర్ఘ ఉద్యమ చరిత్ర ఆయనది. ఉద్యమాన్ని ఎంతో ముందుకు తీసుకెళ్లిన క్రమంలో ఆయన ఎంఆర్పీఎస్‌కు జాతీయ అధ్యక్షుడి స్థానాన్ని సొంతం చేసుకున్నారు. కొన్ని అంతర్గత కారణాలతో రాజీనామా చేసిన మాణిక్యాలరావు 2017లో టీడీపీలో చేరారు. 2019లో రాష్ట్ర కార్యదర్శిగా పని చేశారు. 2019లో పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి బాధ్యతలు స్వీకరించిన నాటినుంచి తనదైన పోరాట పంథాలో ఆయన కొనసాగారు. ఏ చిన్న సమస్య వచ్చినా అక్కడ ప్రత్యక్షమై వైసీపీ ప్రభుత్వం మీద అలుపెరుగని పోరాటం చేశారు. అధికార ప్రతినిధి హోదాలో మీడియా చర్చల్లో తన వాణిని, పార్టీ వైఖరిని బలంగా వినిపిస్తూ వైసీపీ వైఫల్యాలను, దుర్మార్గాలను ప్రజల్లో ఎండగట్టారు. 2021 ఆగస్టు 15న గుంటూరు మంగళదాస్‌నగర్‌లో రమ్య అనే దళిత విద్యార్థిని హత్య ఘటనపై పోరాటం, పరామర్శకు వచ్చిన యువనేత లోకేశ్‌పై వైసీపీ మూకలు దాడికి పాల్పడినప్పుడు ధీటుగా ఎదుర్కొన్నారు. చంద్రబాబు, పట్టాభిపై దాడి, అరెస్టు సమయంలో ఉద్యమించారు. టీడీపీ నేతలను అరెస్టు చేసి గుంటూరులోని సీఐడీ ఆఫీసుకు తరలించిన సమయంలో అక్కడ ఆందోళనలు చేయడం, ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావడం వంటి పోరాటాలకు నాయకత్వం వహించారు. 2024 ఎన్నికల్లో ఎస్సీ నియోజకవర్గమైన ప్రత్తిపాడు ఎమ్మెల్యే టికెట్ ఆశించగా అనూహ్య పరిణామాల నేపథ్యంలో ఆ సీటు విశ్రాంత ఐఏఎస్ బూర్ల రామాంజనేయులుకు దక్కింది. ఈ నేపథ్యంలో మాణిక్యాలరావుకు నామినేటెడ్ పదవిని అప్పగించి తగిన న్యాయం చేసింది.

అంకిత భావానికి గుర్తింపు

మంగళగిరి: టీడీపీ ఆవిర్భావం నుంచి అంకితభావంతో పార్టీనే అంటిపెట్టుకున్న నందం అబద్ధయ్యను ఏపీ పద్మశాలి సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ పదవి వరించింది. టీడీపీ మంగళగిరి నియోజకవర్గ సమన్వయకర్త అబద్ధయ్య మంత్రి నారా లోకేశ్‌కు కుడి భుజంగా పనిచేస్తున్నారు. సౌమ్యుడు, వివాద రహితుడిగా పేరొందిన అబద్ధయ్యకు రాష్ట్ర స్థాయి నామినేటెడ్ పోస్టుల్లో తొలి ప్రాధాన్యం లభించడంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. చేనేత సామాజిక వర్గానికి చెందిన అబద్ధయ్య 1983లో టీడీపీ కార్యకర్తగా రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించి అంచలంచెలుగా ఎదిగారు. 1984 నుంచి 1994 వరకు 21వ వార్డు అధ్యక్షుడిగా పనిచేశారు. 1999 నుంచి మూడేళ్ల వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్‌గా, 2005లో 24వ వార్డు టీడీపీ కౌన్సిలర్‌గా, మున్సిపల్ ఫ్లోర్ లీడర్‌గా పనిచేశారు. 2015 నుంచి 2021 వరకు ఉమ్మడి గుంటూరు జిల్లా ఉపాధ్యక్షులుగా పని చేసిన ఆయన 2022 నుంచి మంగళగిరి నియోజకవర్గ సమన్వయకర్తగా కొనసాగుతున్నారు. రాజకీయంగా ఎన్నో ఆటుపోట్లను చవిచూచిన అబద్ధయ్య 74 ఏళ్ల వయస్సులోనూ విలువలతో కూడిన రాజకీయ విధానాలను అవలంబిస్తూ యువతరానికి స్ఫూర్తిదాయకంగా నిలిచారు.

వరద బాధితులకు పార్ట్‌టైం టీచర్ల విరాళం



సీఎం చంద్రబాబుకు చెక్కు అందజేస్తున్న పార్ట్‌టైం టీచర్లు

తాడికొండ, సెప్టెంబరు 24: వరద బాధితులను ఆదుకోవటానికి డాక్టర్ బీఆర్.అంబేద్కర్ గురుకుల పాఠశాల పార్ట్‌టైం టీచర్లు ముందుకు వచ్చారు. వరద బాధితుల సహాయార్థం సీఎం రిలీఫ్ ఫండ్‌కు రూ.లక్ష డీడీ తీసి మంగళవారం రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు డాక్టర్ బీ.ఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలల పార్ట్‌టైం టీచర్స్ అసోసియేషన్ ద్వారా అందజేశారు. కార్యక్రమంలో పార్ట్‌టైం టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు గోచిపాతల నవీన్‌కుమార్, రాష్ట్ర నాయకులు గురురత్నం, వర్మ, ఇస్మాయిల్, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

జాతీయ ఉత్తమ ప్రిన్సిపాల్‌గా నాదెండ్ల రామారావు



తాడికొండ, సెప్టెంబరు 24: జాతీయ ఉత్తమ ప్రిన్సిపాల్‌గా చలపతి ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్, ప్రొఫెసర్ నాదెండ్ల రామారావు ఎంపికైనట్లు చలపతి విద్యాసంస్థల చైర్మన్ వై.వి.అంజనేయులు పేర్కొన్నారు. ఫార్మసీ వృత్తిలో అత్యుత్తమ సేవలు అందించినందుకుగానూ అసోసియేషన్ ఆఫ్ ఫార్మస్యూటికల్ టీచర్స్ ఆఫ్ ఇండియా(ఏపీటీఐ) జాతీయ ఉత్తమ ప్రిన్సిపాల్ అవార్డుకు రామారావును ఎంపిక చేసిందని చెప్పారు. ఈ నెల 27, 28 తేదీల్లో ఒరిస్సా రాష్ట్రంలోని భువనేశ్వర్‌లో ఏపీటీఐకో-2024 సదస్సులో అవార్డును స్వీకరించనున్నట్లు తెలిపారు. ఫార్మసీ విద్య, పరిశోధనా రంగంలో 33 ఏళ్ల అనుభవంతోపాటు 500 పైగా పరిశోధనా పత్రాలను ప్రచురించి 14 పుస్తకాలు రచించి 4 పేటెంట్లును సొంతం చేసుకున్నారని వివరించారు. ఫార్మసీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా సభ్యునిగా నాణ్యమైన ఫార్మసీ విద్య కోసం ఎన్నో నూతన ఆవిష్కరణలను చేశారని చెప్పారు. ఇప్పటికే ఆంధ్రప్రదేశ్ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులను అందుకున్నారు. జాతీయ ఉత్తమ ప్రిన్సిపాల్ అవార్డు రావటంతో చలపతి విద్యా సంస్థల సెక్రటరీ వై.సుజిత్‌కుమార్, అధ్యాపకులు అభినందించారు.

ఆరు రైళ్ల రద్దు

గుంటూరు, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఇన్‌ఫ్రాస్ట్రక్చరల్ మెయిన్‌టెనెన్స్ వర్కులు కారణంగా ఆరు రైళ్లను కొన్ని రోజుల పాటు రద్దు చేస్తున్నట్లు గుంటూరు డీఆర్ఎం ఎం.రామకృష్ణ మంగళవారం తెలిపారు. నంబరు 17201 గుంటూరు - సికింద్రాబాద్ గోల్కొండ ఎక్స్‌ప్రెస్ అక్టోబరు 7వ తేదీ వరకు, నంబరు 17202 సికింద్రాబాద్ - గుంటూరు గోల్కొండ ఎక్స్‌ప్రెస్ అక్టోబరు 8వ తేదీ వరకు, నంబరు 12706 సికింద్రాబాద్ - గుంటూరు ఇంటరసిటీ, నంబరు 12705 గుంటూరు - సికింద్రాబాద్ ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్‌ని అక్టోబరు 2వ తేదీ వరకు, నంబరు 07464 విజయవాడ - గుంటూరు, నంబరు 07465 గుంటూరు - విజయవాడ రైళ్లను అక్టోబరు 7వ తేదీ వరకు రద్దు చేశామన్నారు.

ఏటా రూ.100 కోట్ల వసూలు లక్ష్యం

- ఇది ఏడాదికి 20 శాతం చొప్పున పెరగాలి
- ప్రతీ మిర్చి టిక్కీకి మార్కెట్ ఫీజు వసూలు చేయాలి
- జీరో బిజినెస్ జరగడానికి వీల్లేదు
- మార్కెటింగ్ శాఖ కమిషనర్ విజయ సునీత ఆదేశాలు



గుంటూరు, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): 'మిర్చియార్డులోకి అమ్మకానికి వచ్చిన ప్రతీ మిర్చి టిక్కీ లెక్కలోకి రావాల్సిందే. ఏ ఒక్కటీ మార్కెటింగ్ ఫీజు చెల్లించకుండా బయటకు వెళ్లడానికి వీల్లేదు. జీరో బిజినెస్‌కి పూర్తిగా అడ్డుకట్ట వేయాలి' అని మార్కెటింగ్ శాఖ రాష్ట్ర కమిషనర్ విజయ సునీత ఆదేశించారు. కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆమె తొలిసారిగా మంగళవారం సాయంత్రం ఎన్టీఆర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ (మిర్చియార్డు) సందర్శనకు వచ్చారు. ఈ సందర్భంగా యార్డులో కార్యకలాపాలను పరిశీలించి పరిపాలన భవనంలో మార్కెటింగ్ జేడీలు కాకుమాను శ్రీనివాసరావు, రాజశేఖర్, సెలెక్షన్ గ్రేడ్ సెక్రెటరీ ఐ.వెంకటేశ్వరరెడ్డి, డీడీ ఝాన్సీరాణితో సమావేశం నిర్వహించారు. పలువురు గ్రేడ్-3, 2 సెక్రెటరీలు, సూపర్‌వైజర్లను కూడా పిలిపించి మాట్లాడారు. అన్ని విషయాలను లోతుగా సమీక్షించారు.

కోల్డ్‌స్టోరేజ్‌లలో 47 లక్షల మిర్చి టిక్కీలు నిల్వ

ఈ సందర్భంగా కమిషనర్ విజయ సునీత మాట్లాడుతూ ఏడాదికి రూ. 100 కోట్ల మార్కెట్ ఫీజు వసూలు లక్ష్యంగా ఉందన్నారు. ఇది ఏటా 20 శాతం పెరుగుతుందన్నారు. మిర్చి లావాదేవీలకు యార్డు కేంద్ర బిందువుగా ఉందనీ, ఇక్కడికి ఇతర జిల్లాలు, వేరే రాష్ట్రాల నుంచి రైతులు మిర్చిని తీసుకువస్తారని చెప్పారు. ప్రస్తుతం అన్‌సీజన్ కావడం వలన రోజుకు 20 వేల టిక్కీలు విక్రయం జరుగుతున్నాయి, రకాన్ని బట్టి క్వింటాల్‌కు రూ.10 వేల నుంచి రూ. 18,500 వరకు ధర లభిస్తుందని అన్నారు. గత సీజన్‌లో ఎక్కువగా దిగుబడి రావడం వలన కోల్డ్‌స్టోరేజ్‌లలో 47 లక్షల మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు సమాచారం అందిందన్నారు. వీటిని సాధ్యమైనంత త్వరగా ఎగుమతి చేయాల్సి ఉందన్నారు. ఇందుకోసం ఎగుమతిదారులతో ప్రత్యేకించి సమావేశం ఏర్పాటు చేసి చర్చిస్తామన్నారు. లేకుంటే మరో రెండు, మూడు నెలల్లో కొత్త స్టాకు వచ్చి రేటు పడిపోయే ప్రమాదం ఉందన్నారు.

వినుకొండ వైద్యశాలలో తనిఖీ

వినుకొండ, సెప్టెంబరు 24: మలేరియా, డెంగీ, టైఫాయిడ్ వంటి సీజనల్ వ్యాధులు ఎన్టీఆర్ వైద్యసేవ పథకం కిందకు వస్తాయని, జిల్లా వ్యాప్తంగా ఉన్న నెట్ వర్కు వైద్యశాల్లో పేదలకు ఉచితంగా వైద్యం అందుతుందని పల్నాడు జిల్లా ఎన్టీఆర్ వైద్య సేవ కోఆర్డినేటర్ డాక్టర్ చంద్రశేఖర్ తెలిపారు. వినుకొండ ప్రభుత్వ వైద్యశాలను మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎన్టీఆర్ వైద్య సేవల ద్వారా చికిత్స పొందిన రోగుల యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎవరైనా డబ్బులు అడిగితే వెంటనే కాల్ సెంటర్‌కు ఫిర్యాదు చేయాలని రోగులకు సూచించారు. వైద్యశాలకు వచ్చేటప్పుడు ఆరోగ్యశ్రీకార్డు తీసుకుని వచ్చి హెల్ప్ డెస్క్ దగ్గర పేరు నమోదు చేసుకుని ఉచితంగా పరీక్షలు చేయించుకుని రోగ నిర్ధారణ అయిన వెంటనే ఆస్పత్రిలో చేరి అన్ని రకాల శస్త్రచికిత్సలు పొంది ఆరోగ్యంగా బయటకు వెళ్లవచ్చని తెలిపారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన డాక్టర్ ఎన్టీఆర్ వైద్యసేవ పథకాన్ని వినియోగించుకోవాలని ఆయన తెలిపారు. ఎవరైనా డబ్బులు అడిగితే ఫిర్యాదు చేయాలన్నారు. ఆయన వెంట డాక్టర్ రజాక్, వైద్యమిత్ర మాచర్ల బుజ్జి, టీమ్ లీడర్ ప్రశాంతి, డీఈవో సాగర్, వైద్యశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పులిచింతల సమాచారం

అచ్చంపేట, సెప్టెంబరు 24: పులిచింతల ప్రాజెక్టులో మంగళవారం 42.16 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్టు పులిచింతల ప్రాజెక్టు ఏఈ రాజు తెలిపారు. ఎగువ నుంచి 33,490 క్యూసెక్కుల నీరు ప్రాజెక్టుకు చేరుతుంది. ప్రాజెక్టు వద్ద ఒక గేటు ద్వారా 36,950 క్యూసెక్కుల నీరు దిగువ కృష్ణకు విడుదల అవుతున్నాయి. వీటిలో 16 వేల క్యూసెక్కుల నీరు పవర్ జనరేషన్ ద్వారా కృష్ణానదికి వస్తున్నాయి.

విద్యుత్‌శాఖలో ఈఈల బదిలీలు

గుంటూరు, సెప్టెంబరు 24: సాధారణ బదిలీల్లో భాగంగా ఏపీ సీపీడీసీఎల్ పరిధిలోని గుంటూరు, సీఆర్‌డీఏ సర్కిల్స్ పరిధిలో పలువురు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఈఈ)లను బదిలీ చేస్తూ సీఎండీ పి.రవి ఉత్తర్వులు జారీ చేశారు. కాగా సీఆర్‌డీఏ సర్కిల్‌తో పాటు గుంటూరు సర్కిల్‌ను మూడు సర్కిల్స్‌గా విభజిస్తూ బదిలీలు చేశారు. గుంటూరు సర్కిల్ పరిధిలో ఉన్న పల్నాడు, బాపట్ల జిల్లాలను కూడా పల్నాడు, బాపట్ల సర్కిల్స్‌ను ఏర్పాటు చేస్తూ బదిలీ ప్రక్రియ నిర్వహించారు. ఈ బదిలీల్లో గుంటూరు సర్కిల్‌లోని గుంటూరు టౌన్ -1 ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ తిరుమలశెట్టి శ్రీనివాసబాబు, సీఆర్‌డీఏలోని గుంటూరు-2 ఈఈ రమేష్‌బాబు, చీరాల ఈఈ కె.జాన్‌థామస్, అద్దంకి ఈఈ ఎన్.మస్తాన్‌రావు, బాపట్ల ఈఈ ఆంజనేయులు, గుంటూరు కన్‌స్ట్రక్షన్స్ ఈఈ ఎమ్ శ్రీనివాసబాబులను వారి వారి స్థానాల్లోనే కొనసాగిస్తూ ఆదేశాలు జారీ చేశారు. వారితో పాటు పలువురు డిప్యూటీ ఈఈలు, ఏఈలు, వివిధ కేటగిరీల ఉద్యోగులను బదిలీ చేస్తూ ఆదేశాలు జారీ చేశారు.

గుంటూరు సర్కిల్‌లో ఈఈల బదిలీలు ఇలా...

అధికారి పేరు	ప్రస్తుత స్థానం	బదిలీ అయిన స్థానం
కేవీఎల్ఎన్ మూర్తి	డీపీఈ/ ఈఈ	టెక్నికల్ ఈఈ, గుంటూరు
ఎమ్ శ్రీనివాసరావు	గుంటూరు కన్‌స్ట్రక్షన్‌ఈఈ	అదే స్థానం
సీహెచ్ వెంకటేశ్వరరావు	ఎంఆర్‌టీ, గుంటూరు	డీపీఈ, ఈఈ, గుంటూరు
కె సూర్యప్రకాష్	డీపీఈ, ఈఈ, గుంటూరు	ఎంఆర్‌టీ, ఈఈ, గుంటూరు
టి శ్రీనివాసబాబు	గుంటూరు టౌన్-1	అదే స్థానం
టీవీ తులసీరామ్	అమరావతి, ఈఈ	తెనాలి
బాపట్ల సర్కిల్‌లో...		
జి ఆంజనేయులు	బాపట్ల, ఈఈ	అదే స్థానం
ఎన్ సింగయ్య	ఎం, పీ-1, గుంటూరు, ఈఈ	ఈఈ, కన్‌స్ట్రక్షన్స్, బాపట్ల
వీవీ చిరంజీవి	ఈఈ, తెనాలి	ఎంఆర్‌టీ, ఈఈ, బాపట్ల
ఎస్ఏ కరీమ్	ఈఈ, దర్శి	ఈఈ , డీపీఈ, బాపట్ల
పి నాగేశ్వరరావు	ఈఈ, ఎం, పీ-11, గుంటూరు	ఈఈ, టెక్నికల్, బాపట్ల
కె జాన్ థామస్	ఈఈ, చీరాల	అదే స్థానం
ఎన్ మస్తాన్‌రావు	ఈఈ, అద్దంకి	అదే స్థానం
పల్నాడు సర్కిల్ పరిధిలో...		
కె రామసుబ్బారావు	ఈఈ, కార్పొరేట్ ఆఫీస్	ఈఈ, టెక్నికల్, కన్‌స్ట్రక్షన్ పల్నాడు
జె శ్రీనివాసులరెడ్డి	ఈఈ, టెక్నికల్, గుంటూరు	ఈఈ ,ఎమ్ఆర్‌టీ, పల్నాడు
సీహెచ్ రామ్‌బొట్లు	ఈఈ, టెక్నికల్, సీఆర్‌డీఏ	ఈఈ, నరసరావుపేట
ఎమ్ భాస్కరరావు	ఈఈ , మచిలీపట్నం	ఈఈ, మాచర్ల
సీఆర్‌డీఏ సర్కిల్ పరిధిలో....		
జె హరిబాబు	ఈఈ, మాచర్ల	ఈఈ, టెక్నికల్, కన్‌స్ట్రక్షన్ సీఆర్‌డీఏ
ఎస్ శ్రీనివాసరావు	ఈఈ, నరసరావుపేట	ఈఈ, ఎమ్ఆర్‌టీ, సీఆర్‌డీఏ
సీహెచ్ రమేష్	ఈఈ, గుంటూరు టౌన్-2	అదే స్థానం
జె శ్రీనివాసరావు	ఈఈ, విజయవాడ - ఈఈ	ఈఈ, అమరావతి

సంక్షేమం.. అభివృద్ధే కూటమి ప్రభుత్వ లక్ష్యం



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి నాదెండ్ల మనోహర్

కొల్లిపర, సెప్టెంబరు 24 : ప్రజా సంక్షేమం... అభివృద్ధే కూటమి ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. మంగళవారం మండల కేంద్రం కొల్లిపర పాల ఉత్పత్తిదారుల కల్యాణ మండపంలో జరిగిన కూటమి ప్రభుత్వం వంద రోజులు పరిపాలన, డ్వాక్రా రుణాల చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. కార్యక్రమానికి డీఆర్‌డీఏ ఏపీఎం ప్రియదర్శిని అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మనోహర్ మాట్లాడుతూ ప్రతి మహిళా ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. రానున్న రోజుల్లో డ్వాక్రా మహిళలకు మండలంలో వంద కోట్లు రుణాలు ఇచ్చేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. మహిళా రైతులకు ప్రతి మండలంలో డ్రోన్‌లు ఇచ్చే ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. డ్రోన్‌లు ద్వారా మహిళలు లక్ష రూపాయలు ఆదాయం పొందవచ్చునన్నారు. అనంతరం డ్వాక్రా మహిళలకు రూ.24 కోట్లు చెక్కుల రూపంలో అందించారు. ఎంపీడీవో విజయలక్ష్మి, తహసీల్దార్ గుమ్మడి సిద్ధార్థ, జిల్లా వ్యవసాయాధికారి నున్నా వెంకటేశ్వర్లు, ఏడీఏ ఉషారాణి, జిల్లా ఉద్యానవన శాఖాధికారి రవీంద్రబాబు, ఏవో వెంకట్రావు పాల్గొన్నారు.

భారత్‌లో జమిలి ఎన్నికలు సాధ్యం కాదు



ప్రసంగిస్తున్న డాక్టర్ తులసి రెడ్డి, పక్కన లక్ష్మణరావు

గుంటూరు (కార్పొరేషన్), సెప్టెంబరు 24: భారతదేశంలో జమిలి ఎన్నికలు నిర్వహించడం సాధ్యం కాదనీ, ఆవశ్యకత లేదని రాజ్యసభ మాజీ సభ్యులు, కాంగ్రెస్ ఏపీ మీడియా కమిటీ చైర్మన్ డాక్టర్ ఎన్.తులసీ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం జనచైతన్య వేదిక ఆధ్వర్యంలో జమిలి ఎన్నికలు అవసరమా? సాధ్యమా? అనే అంశంపై జరిగిన చర్చాగోష్టికి జన చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి అధ్యక్షత వహించారు. ఎన్.తులసీరెడ్డి మాట్లాడుతూ జమిలి ఎన్నికలు నియంతృత్వానికి దారి తీస్తుందని, స్థానిక సమస్యల ప్రాధాన్యం తగ్గుతుందనీ, అవినీతి తారాస్థాయికి చేరుతుందని వివరించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఐదేళ్లలో 500 లక్షల కోట్లు బడ్జెట్లలో వ్యయం చేస్తుంటే అందులో ఎన్నికల కోసం 10 వేల కోట్లు అనేది కేవలం 0.01 శాతం మాత్రమే అని తెలిపారు. మోడీ ప్రభుత్వం చెబుతున్నట్టుగా ఎన్నికలు విడివిడిగా జరగడం వలన అభివృద్ధికి నోచుకోలేకపోతున్నామనేది అర్థరహితం అన్నారు. శాసన మండలి సభ్యులు కె.ఎస్.లక్ష్మణరావు మాట్లాడుతూ జమిలి ఎన్నికలు అమల్లోకి రావాలంటే రాజ్యాంగంలో ప్రధానంగా ఆరు సవరణలు చేయాలని అన్నారు. జమిలి ఎన్నికలు పార్లమెంటరీ ప్రజాస్వామ్యాన్ని, బహు పార్టీ వ్యవస్థను, ఫెడరలిజాన్ని దెబ్బతీస్తుందని తెలిపారు. జన చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు వల్లంరెడ్డి లక్ష్మణ రెడ్డి మాట్లాడుతూ కోటిలోపు జనాభా ఉన్న 100 దేశాలు ప్రపంచంలో ఉన్నాయని, ఇలాంటి పరిస్థితులలో అత్యధిక జనాభా గల రాష్ట్రాలు భారతదేశంలో జమిలి ఎన్నికలు ద్వారా స్వయం ప్రతిపత్తిని కోల్పోతాయని అన్నారు. సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ళ నాగేశ్వరరావు, ప్రముఖ విద్యావేత్త మేకల రవీంద్రబాబు, రాజ్యాంగ చర్చా వేదిక కన్వీనర్ అవధానుల హరి, నేస్తం సహ వ్యవస్థాపకులు టి.ధనుంజయ రెడ్డి, దళిత బహుజన ఫ్రంట్ వ్యవస్థాపకులు వినయ్ కుమార్ ప్రసంగించారు.

విద్యార్థులతో స్నేహంగా మెలగాలి

బోయపాలెం(యడ్లపాడు), సెప్టెంబరు 24 : కుటుంబ సభ్యులకు దూరంగా విద్యనభ్యసించేందుకు వచ్చిన విద్యార్థుల పట్ల స్నేహపూర్వకంగా మెలగాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు బత్తుల పద్మావతి సూచించారు. మండలంలోని బోయపాలెం పరిధిలో గల డాక్టర్ బీఆర్ అంబేద్కర్ బాలుర గురుకుల పాఠశాలను ఆమె గురువారం సందర్శించారు. ముందుగా వంటగదిని, అక్కడి సరుకుల నాణ్యతను పరిశీలించారు. మధ్యాహ్నం విద్యార్థులకు అందించిన రాగిజావను పరిశీలించగా, వాసన వస్తుండడంతో, స్టాక్ రూంను పరిశీలించారు. గడువు ముగిసిన 40 కేజీల రాగి పిండి ప్యాకెట్లు దర్శనమిచ్చాయి. స్టాక్ రిజిష్టర్లు చూపించాలని ప్రిన్సిపాల్ హనుమంతరావును కోరగా రికార్డులు లేవని, కేవలం ఆన్‌లైన్‌లో నమోదు చేస్తామని చెప్పారు. దీంతో స్టాకు రిజిష్టర్లు ఫిజికల్‌గా లేకపోవడం ఏమిటని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. చిన్నారులను దండించకూడదని చట్టాలు చెబుతున్నా, మీరు ఎందుకు కొడుతున్నారని, క్లాస్ రూంకు బెత్తాలు తీసుకురాకూడదని మీకు తెలియదా అని ప్రిన్సిపాల్‌ను ప్రశ్నించారు. ఫిర్యాదుల పెట్టె ఎందుకు పెట్ట లేదని ప్రశ్నించిన ఆమె విద్యార్థులకు అందుబాటులో ఫోన్ ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం ఆమె విలేకర్లతో మాట్లాడుతూ బాలల కమిషన్ సుమోటోగా తీసుకుని కేసు నమోదు చేస్తుందనీ, ప్రిన్సిపాల్‌కు మెమో జారీ చేయాలని డీసీవోను ఆదేశించినట్లు చెప్పారు. తహసీల్దార్ విజయశ్రీ, ఎంఈవో నాగరత్నం, ఏసీడీపీవో బి.నిర్మలారాణి, ఎస్సై బాలకృష్ణ ఉన్నారు.

బాధ్యులపై చర్యలు తీసుకోవాలి

యడ్లపాడు, సెప్టెంబరు 24: గురుకుల పాఠశాల విద్యార్థులకు సంబంధించిన విషయంపై పూర్తి విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఏఐవైఎఫ్, ఏపీ ప్రైవేట్ టీచింగ్ ప్రొఫెషనల్ వెల్ఫేర్ అసోసియేషన్, ఎస్సీ, ఎస్టీ, బీసీ ప్రజా సంఘాల నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. యడ్లపాడు మండలం బోయపాలెం పరిధిలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ బాలుర గురుకుల పాఠశాలను వారు మంగళవారం సందర్శించారు. విద్యార్థులు పాఠశాల నుంచి పరారవడంపై ప్రిన్సిపాల్‌ను అడిగి తెలుసుకున్నారు. ఏఐవైఎఫ్, ప్రైవేటు టీచర్స్ వెల్ఫేర్ అసోసియేషన్, గిరిజన సంఘాల ఐక్యవేదిక నాయకులు బి.శ్రీనునాయక్, చెన్నకేశవులు, రాంబాబు, నాగరాజు, వెంకట నగేష్, వెంకట బుల్లోడు, లెనిన్‌బాబు, చిన్న, రాంబాబు నాయక్, వెంకట్ ఉన్నారు.

సీఈవోగా జ్యోతిబసు బాధ్యతల స్వీకరణ



గుంటూరు సిటీ, సెప్టెంబరు 24 : ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్ సీఈవోగా వి.జ్యోతిబసు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో కృష్ణా జిల్లా సీఈవోగా పనిచేసిన ఆయన్ను ప్రభుత్వం గుంటూరు బదిలీ చేసిన విషయం విదితమే. బాధ్యతలు స్వీకరించిన తర్వాత జడ్పీ చైర్ పర్సన్ కత్తెర హెన్రీ క్రిస్టినా ను మర్యాద పూర్వకంగా కలిశారు. జడ్పీ చైర్ పర్సన్ దంపతులు నూతన సీఈవో కు శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం సీఈవో జిల్లా కలెక్టర్ నాగలక్ష్మిని కలిశారు. కార్యక్రమంలో పంచాయతీ రాజ్ అసోసియేషన్ రాష్ట్ర నాయకులు డాక్టర్ కూచిపూడి మోహన్‌రావు, ఏసీ హాల్ ఇన్‌ఛార్జి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

27న జాబ్‌మేళా

గుంటూరు(విద్య),సెప్టెంబరు 24: ఈనెల 27న నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు సంస్థ డైరెక్టర్ పిన్నెంటి ప్రణయ్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇలా అగ్రిసర్వీసెస్ ప్రైవేటు లిమిటెడ్, పయనీర్ ఆటోమోటివ్స్, కేఎల్‌గ్రూపు అమెజాన్ వేర్‌హౌస్, వేటూ న్యూస్, మాస్టర్‌మైండ్స్ తదితర సంస్థలు జాబ్‌మేళాలో పాల్గొంటాయని తెలిపారు. పది నుంచి ఇంటర్, డిగ్రీ, పీజీ పూర్తి చేసి 18 నుంచి 35 ఏళ్ల వయసు ఉన్నవారు అర్హులని తెలిపారు. జాబ్‌మేళా నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ మణిపురం ఫ్లైవోర్ కింద, అశ్వని హాస్పటల్ ఎదురు, గుంటూరు, సాంఘిక సంక్షేమ శాఖ బాలురు వసతి గృహం, ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఎదురు, అమరావతి రోడ్డు, తూళ్లూరులో ఇంటర్వ్యూలు ఉంటాయని తెలిపారు. వివరాల కోసం డి.నరేష్(9866366187), ఎ.వెంకటరావు(9505719172)లో సంప్రదించాలని సూచించారు.

బైకుల చోరీ కేసులో నిందితుడు అరెస్టు



నిందితుడి వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

కొల్లిపర, సెప్టెంబరు 24: బైకుల చోరీ కేసులో ముద్దాయిని అరెస్టు చేసి, అతని వద్ద నుంచి ఆరు బైకులను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ శ్రీనివాసరావు తెలిపారు. మంగళవారం పోలీసుస్టేషన్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కొల్లిపరకు చెందిన అమిరే ఆనందకిషోర్ 2022 నుంచి దొంగతనాలు చేయడం మొదలు పెట్టాడు. అనేక కేసుల్లో జైలుకు వెళ్లి బెయిల్‌పై వచ్చి మళ్లీ చోరీలకు పాల్పడుతున్నట్లు తెలిపారు. గుంటూరులో రెండు బైకులు, తెనాలిలో రెండు బైకులు, కొల్లిపరలో రెండు బైకులు దొంగతనం చేసినట్లు తెలిపారు. కొల్లిపర ఎస్ఐ కోటేశ్వరరావు, ఏఎస్ఐ పోతురాజు ఆధ్వర్యంలో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయడంతో గత సోమవారం రాత్రి కొల్లిపర మండలంలోని దావులూరు అడ్డరోడ్డు వద్ద ముద్దాయిని అరెస్టు చేసినట్లు శ్రీనివాసరావు తెలిపారు.

గుర్తుతెలియని వాహనం ఢీ: వ్యక్తి మృతి

నకరికల్లు, సెప్టెంబరు 24: అద్దంకి - నార్కెట్‌పల్లి ప్రధాన రహదారిపై ఫ్లైఓవర్ బ్రిడ్జి దిగువున రోడ్డు దాటుతున్న వ్యక్తిని గుర్తుతెలియని వాహనం ఢీకొనటంతో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. నకరికల్లుకు చెందిన కేలం రామకృష్ణ(41) పిడుగురాళ్లలో గోతాల కంపెనీలో పని చేసేందుకు రోజూ వెళ్తుంటాడు. సోమవారం కూడా నకరికల్లు నుంచి పిడుగురాళ్లకు పని చేసేందుకు వెళ్లాడు. సోమవారం రాత్రి 9 గంటల సమయంలో తన భార్య సత్యవేణికి ఫోన్ చేసి ఈ రోజు పని ఎక్కువగా ఉంది, సమయం దాటితే బస్సులు ఉండవు, ఉదయాన్నే వస్తానని చెప్పాడు. మంగళవారం తెల్లవారుజామున 3 గంటల సమయంలో పిడుగురాళ్ల నుంచి రామకృష్ణ నకరికల్లుకు వచ్చాడు. ఫ్లైఓవర్ బ్రిడ్జిపై దిగి రోడ్డు దాటి ఊర్లోకి వచ్చే సమయంలో గుర్తుతెలియని వాహనం ఢీకుంది. ఈ ప్రమాదంలో రామకృష్ణ అక్కడికక్కడే మృతి చెందాడు. భార్య సత్యవేణి ఫిర్యాదు మేరకు నకరికల్లు ఎస్ఐ చల్లా సురేష్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.


కృష్ణానదిలో పడి మహిళ మృతి



మంగమ్మబాయి (ఫైల్ ఫొటో)

దాచేపల్లి, సెప్టెంబరు 24: కృష్ణానదిలో నీళ్ల తాగేందుకు వెళ్లి ఒడ్డుకు రాలేక ఇబ్బంది పడుతున్న గేదెను కాపాడబోయి ప్రమాదవశాత్తూ మహిళ నదిలో పడి మృతి చెందిన సంఘటన మంగళవారం మండలంలోని భట్రుపాలెం గ్రామం వద్ద జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. దాచేపల్లి మండలం భట్రుపాలెం గ్రామంలో కేతావత్ మంగమ్మబాయి(43) గేదెలను కృష్ణానది ఒడ్డున మేపేందుకు వెళ్లింది. గేదె ఒకటి నదిలోకి దిగి నీళ్ల తాగుతూ నదిలోనే ఆగింది. ఆ గేదెను ఒడ్డుకు తీసుకొచ్చేందుకు వెళ్లిన మంగమ్మబాయి ప్రమాదవశాత్తూ నీట మునిగి మృతి చెందింది. మృతురాలికి భర్త అమ్మనాయక్, ముగ్గురు పిల్లలు ఉన్నారు. సంఘటన గురించి తెలుసుకున్న స్థానికులు మృతదేహాన్ని నది ఒడ్డుకు చేర్చారు.

రైలు కింద తల పెట్టి బలవన్మరణం



తెనాలి క్రైం, సెప్టెంబరు 24: కదులుతున్న రైలు కింద తల పెట్టి గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన తెనాలి రైల్వే స్టేషన్ సమీపంలోని మొండిగోడల వద్ద మంగళవారం జరిగింది. తెనాలి ఆర్‌పీఎఫ్ ఎస్ఐ జి.వెంకటాద్రి తెలిపిన వివరాల ప్రకారం సుమారు 55 ఏళ్ల గుర్తుతెలియని వ్యక్తి స్టేషన్ సమీపంలోని మొండిగోడల వద్ద ట్రాక్ పక్కగా నిలబడి ఎదురుగా వస్తున్న రైలు కింద ఒక్కసారిగా తలపెట్టి బలవన్మరణానికి పాల్పడ్డాడు. మృతుని వద్ద ఎలాంటి వ్యక్తిగత సమాచారం లభించలేదు. మృతదేహాన్ని తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

ఎన్ఎస్‌పీ కాలువలో కొట్టుకుపోయి యువకుడు మృతి

సత్తెనపల్లి, సెప్టెంబరు 24: వినాయక నిమజ్జనంలో ఎన్ఎస్‌పీ కాలువలో ఇద్దరు యువకులు గల్లంతు కాగా, ఒకరిని స్థానికులు కాపాడారు. లక్కరాజుగార్లపాడులోని గుంటూరు బ్రాంచ్ కాలువ వద్ద మంగళవారం తెల్లవారుజామున జరిగింది. వివరాల్లోకి వెళ్తే.. వడ్డవల్లి పీర్లచాడివి ప్రాంతంలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాన్ని నిమజ్జనోత్సవానికి లక్కరాజుగార్లపాడులోని ఎన్ఎస్‌పీ కాలువ వద్దకు భక్తులు, కమిటీ సభ్యులు ఊరేగింపుగా తీసుకెళ్లారు. పీర్లచావిడి ప్రాంతానికి చెందిన రఫీ, తిరుపతిరావు ఈత కొట్టేందుకు కాలువలోకి దూకారు. కాలువ ఉధృతంగా ప్రవహిస్తుండటంతో రఫీ కొట్టుకు పోగా తిరుపతిరావును స్థానికులు కాపాడారు. ఎన్ఎస్‌పీ అధికారులు, పోలీసులకు సమాచారం ఇవ్వడంతో కాలువ నీటిని నిలుపుదల చేయించి గల్లంతైన రఫీ కోసం గాలింపు చేపట్టారు. ఎన్ఎస్‌పీ కాలువలో కొట్టుకుపోయిన రఫీ మృతదేహం లభించింది.

కారు ఢీ: వ్యక్తి మృతి

బాపట్ల,సెప్టెంబరు 24 : ఏరియా వైద్యశాల ఔట్‌పోస్ట్ సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం కర్లపాలెం రోడ్డులో డాక్టర్ ఎన్టీఆర్ వ్యవసాయ ఇంజనీరింగ్ కళాశాల ఎదురు నేషనల్ హైవే రోడ్డుపై స్కూటీపై వెళుతున్న దేవరకొండ వెంకటేశ్వరరావు (35) పార్వతి దంపతులను వెనుక నుంచి వచ్చిన కారు ఢీకొట్టింది.స్థానికులు వారిని ఏరియా వైద్యశాలకు తరలించారు. అప్పటికే వెంకటేశ్వరరావు మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడి భార్య పార్వతికి తీవ్రగాయాలయ్యాయి. పోలీసులు వివరాలు సేకరిస్తున్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.55
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	130, 139,150
చికెన్ విత్ స్కిన్	248.00
చికెన్ స్కిన్ లెస్	258.00

46,245 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు మంగళవారం 48,267 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 46,245 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఐ వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 24,264 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			**ఏసీ కామన్ వెరైటీ**		
334	8000	16500	334	9000	16500
నెంబరు. 5	9500	14500	నెంబరు. 5	10000	15500
273	9000	14000	273	9500	10000
341	9000	15500	341	9500	16500
4884	13000	13500	4884	10000	13600
సూపర్ 10	--	--	సూపర్ 10	--	--
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			**ఏసీ స్పెషల్ వెరైటీ**		
తేజ	8000	18600	తేజ	9500	18500
బ్యాడిగి	9000	15000	బ్యాడిగి	9000	15000
దేవనూరు డీలక్స్	9000	15500	దేవనూరు డీలక్స్	10500	16500
తెల్లకాయలు	5000	11500	తెల్లకాయలు	5000	10500

పల్నాడు వార్తలు

దాతృత్వం చాటుకున్న కాకతీయ ఎడ్యుకేషనల్ సొసైటీ



ముఖ్యమంత్రి చంద్రబాబుకు రూ.6 లక్షల చెక్కును అందిస్తున్న శ్రీకాకతీయ ఎడ్యుకేషనల్ సొసైటీ డైరెక్టర్లు సాంబశివరావు, లలితబాబు, విద్యార్థులు

పెదకూరపాడు, సెప్టెంబరు 24: వరద బాధితులను ఆదుకోవటంలో పెదకూరపాడుకు చెందిన కాకతీయ ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న విద్యాసంస్థల యాజమాన్యం తమ దాతృత్వాన్ని మరోసారి చాటుకున్నారు. సీఎం చంద్రబాబునాయుడుకు వరద బాధితుల సహాయార్థం విద్యార్థులు, అధ్యాపకులు, ఉపాధ్యాయులు, యాజమాన్యం ఇచ్చిన ఐదు లక్షల రూపాయల చెక్కుతో పాటు పేదలకు ఐదు రూపాయలకే అన్నం పెట్టి ఆకలి తీర్చే అన్న క్యాంటీన్‌కు తమ సంస్థ నుంచే మరో లక్ష రూపాయల చెక్కుతో కలిపి రూ.6 లక్షల చెక్కులను రాష్ట్ర సచివాలయం అమరావతిలో ముఖ్యమంత్రిని కలసి విద్యార్థుల చేతుల మీదుగా అందించినట్లు కాకతీయ విద్యాసంస్థల డైరెక్టర్లు శీలమనేని సాంబశివరావు, పీవీ లలితబాబులు మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి నారా లోకేశ్‌ను కూడా కలవటంతో వారి దీవెనెలు పిల్లలకు అందించారన్నారు. ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ స్ఫూర్తితో ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు మానవతా దృక్పథంతో ముందుకు వచ్చి సాయం అందించాలనే పిలుపుతో ఈ కార్యక్రమం చేపట్టామన్నారు.

నూర్‌బాషాలకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటుపై హర్షం

మాచర్లటౌన్, సెప్టెంబరు 24: నూర్ బాషాలకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేస్తున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రకటించడంపై నూర్‌బాషా సంఘీయులు హర్షం వ్యక్తం చేశారు. మంగళవారం పట్టణంలో వారు మాట్లాడుతూ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీని నెరవేర్చినందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు కృతజ్ఞతలు తెలిపారు. హజ్‌యాత్రకు వెళ్లే వారికి రూ. లక్ష ఆర్థికసాయం ప్రకటించడం ఆనందంగా ఉందన్నారు. నూర్‌బాషా సంక్షేమ సంఘం రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ, నూర్‌బాషా టీడీపీ జిల్లా సాధికార సమితి కన్వీనర్ షేక్ బాదన్‌బాయి తదితరులు ఉన్నారు.

మూడు రోజులపాటు మున్సిపల్ రిజర్వాయర్ నీరు సరఫరా

● చైర్మన్ నరసింహారావు

మాచర్లటౌన్, సెప్టెంబరు 24: మూడు రోజుల పాటు మున్సిపల్ రిజర్వాయర్‌లోని నీటిని పట్టణ ప్రజలకు సరఫరా చేయనున్నట్లు మున్సిపల్ చైర్మన్ పోలూరి నరసింహారావు తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ నేషనల్ హైవే నిర్మాణ పనులు జరుగుతున్నందున కుడికాలువ ద్వారా నీటిని అందించే పైపులైన్లను తొలగించినట్లు చెప్పారు. హైవే పనులు మూడు రోజుల్లో పూర్తవుతాయని, పనులు పూర్తయ్యే వరకు మున్సిపల్ రిజర్వాయర్ నీటిని అందిస్తామని చెప్పారు. పట్టణ ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

దాచేపల్లి ఎంపీడీవోగా రామకృష్ణ బాధ్యతల స్వీకారం



దాచేపల్లి, సెప్టెంబరు 24: దాచేపల్లి ఎంపీడీవో గా పాలా రామ కృష్ణ మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటివరకు ఎంపీడీవోగా పనిచేసిన శోభారాణి రేపల్లెకు బదిలీపై వెళ్లారు. సాధారణ బదిలీల్లో భాగంగా దాచేపల్లికి వచ్చిన రామకృష్ణ ఏపీ అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్ డిపార్ట్‌మెంట్ నుంచి బదిలీపై వచ్చారు. పంచాయతీ కార్యదర్శులు, ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది బదిలీపై వెళ్తున్న ఎంపీడీవో శోభారాణిని, నూతనంగా బాధ్యతలు చేపట్టిన రామకృష్ణలను సన్మానించారు.

మాచవరం ఎంపీడీవోగా శ్రీనివాసరావు



మాచవరం, సెప్టెంబరు 24 : మాచవరం మండల నూతన ఎంపీడీవోగా పీ శ్రీనివాసరావు నియమితులయ్యారు. ఆయన గుంటూరులో న్యాయశాఖలో పనిచేస్తూ బదిలీపై మాచవరం ఎంపీడీవోగా వచ్చారు. ఇప్పటి వరకు ఇన్‌చార్జ్ ఎంపీడీవోగా ఏవో ప్రసాదరావు వ్యవహరించిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా నూతన ఎంపీడీవోను టీడీపీ నాయకులు, అధికారులు ఘనంగా సత్కరించారు. ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని ఎంపీడీవో తెలిపారు.

పల్నాడు, రేపల్లె ఫాస్ట్ ప్యాసింజర్‌లకు హాల్ట్ కల్పించాలి

పెదకూరపాడు, సెప్టెంబరు 24 : పెదకూరపాడు రైల్వే స్టేషన్‌లో పల్నాడు ఎక్స్‌ప్రెస్, రేపల్లె ఫాస్ట్ ప్యాసింజర్లకు హాల్ట్ కల్పించాలని మంగళవారం కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలకు, రైల్వే డీఎం రామకృష్ణలకు లేఖలు రాసినట్లు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ తెలిపారు. నియోజకవర్గ ప్రజల అభ్యర్థన మేరకు రైల్వే హాల్ట్ కల్పించాలని లేఖలో కోరారు.

జిల్లాస్థాయి ఖోఖో జట్టుకు సెయింట్ జాన్స్ విద్యార్థిని

కారంపూడి, సెప్టెంబరు 24: పట్టణంలోని సెయింట్ జాన్స్ హైస్కూల్ విద్యార్థిని ఆర్ అశ్విని జిల్లా స్థాయిలో అండర్ 14, అండర్ 17 విభాగాల్లో ఖోఖో పోటీలకు ఎంపికైనట్లు కరస్పాండెంట్ ఫాదర్ అనిల్‌కుమార్, ప్రిన్సిపాల్ బినోమా తెలిపారు. మంగళవారం పాఠశాలలో విద్యార్థిని అశ్వినిని అభినందించారు. కారంపూడి జిల్లా పరిషత్ హైస్కూల్లో జరిగిన స్కూల్ గేమ్స్ పోటీల్లో అశ్విని జిల్లాస్థాయికి ఎంపికైనట్లు చెప్పారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థుల ప్రతిభ

సత్తెనపల్లి, సెప్టెంబరు 24 : మండలంలోని నందిగామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో మంగళవారం నిర్వహించిన మండల స్థాయి వివిధ ఆటల పోటీల్లో పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థులు పాల్గొని ప్రతిభ చూపారు. కబడ్డీ, ఖోఖో, షటిల్ బాడ్మింటన్, అండర్- 14, అండర్ - 17 విభాగాల్లో వై యానిత్రీ, ఆర్ మానస, షేక్ షమీమూన్, షేక్ సమీరా, సయ్యద్ అఫ్రోజ్, సమీర భాను, అమూల్య, చైత్ర, ఏ శ్రీలక్ష్మి, అక్షయ జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారని హైస్కూల్ ప్రధానోపాధ్యాయిని మాధవీలత, పీఈటీ సునీత, శివ గోవర్ధన, శాస్త్రిలు తెలిపారు. విద్యార్థులను హెచ్‌ఎం, ఉపాధ్యాయులు, తోటి విద్యార్థులు అభినందించారు.

● నందిగామలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఆటల పోటీల్లో హోలీ ఫ్యామిలీ హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ చూపి నియోజకవర్గస్థాయి పోటీలకు ఎంపికయ్యారని హైస్కూల్ హెచ్‌ఎం విజయరాణి, పీఈటీ అచ్చిరెడ్డిలు తెలిపారు. విద్యార్థులను ఉపాధ్యాయులు, తోటి విద్యార్థులు అభినందించారు.

స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో కుస్తీ పోటీలు

అచ్చంపేట, సెప్టెంబరు 24: అచ్చంపేటలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో మంగళవారం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్- 19 విభాగంలో బాలబాలికలకు రెజ్లింగ్ పోటీలు జరిగినట్లు ప్రిన్సిపాల్ అరుణ్‌కుమార్ తెలిపారు. బాలుర విభాగంలో గురుకుల పాఠశాలకు చెందిన బాలురతోపాటు సత్తెనపల్లికి చెందిన బాలుర సంక్షేమ గురుకుల పాఠశాల విద్యార్థి ఎంపికయ్యారు. బాలికల విభాగంలో సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాల విజయపురిసౌత్‌కు చెందిన బాలికలు, బాపట్లకు చెందిన గురుకుల కళాశాల విద్యార్థిని, అమరావతి సంక్షేమ గురుకుల కళాశాలకు చెందిన విద్యార్థిని ఎంపికయ్యారు. ఎంపికైన క్రీడాకారులు అక్టోబరు 3, 4, 5 తేదీల్లో కృష్ణా జిల్లాలోని నున్న గ్రామంలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు.

టీడీపీ నేత పుల్లయ్యకు మాతృవియోగం

దుర్గి, సెప్టెంబరు 24: టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర సెక్రటరీ ముత్తినేని పుల్లయ్యకు మాతృవియోగం కలిగింది. పుల్లయ్య తల్లి నాగమ్మ మండలంలోని ఆత్మకూరులో గల స్వగృహంలో మంగళవారం గుండెపోటుతో మరణించారు. టీడీపీ నేతలు ఆత్మకూరుకు చేరుకొని నాగమ్మ భౌతికకాయం వద్ద నివాళులర్పించారు.

ఆర్‌అండ్‌బీ రోడ్డులో లోలెవల్ చప్టాపై వర్షపు నీరు



పెదకూరపాడు నుంచి అమరావతి వెళ్లే రోడ్డులో లోలెవల్ చప్టాపై ఉధృతంగా ప్రవహిస్తున్న వర్షపు నీరు

పెదకూరపాడు, సెప్టెంబరు 24: మండలంలో మంగళవారం కురిసిన భారీ వర్షానికి పెదకూరపాడు నుంచి అమరావతి వెళ్లే ఆర్ అండ్‌బీ రోడ్డులో లోలెవల్ చప్టాలపై వర్షపు నీరు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో వాహనాలు గంటల తరబడి నిలిచిపోయాయి. 75తాళ్ళూరు నుంచి పరస, బలుసుపాడు, కంభంపాడు, లింగాపురం గ్రామాల మధ్య వర్షపు నీరు ప్రవహిస్తుండటంతో గుంటూరు నుంచి అమరావతి వెళ్లే ప్రయాణికులు ఇబ్బందిపడ్డారు.

పంట దిగుబడులు పెంచేందుకే 'పొలం పిలుస్తోంది'

● ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి



కారంపూడిలో దుక్కి దున్నుతున్న ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి

కారంపూడి, సెప్టెంబరు 24: రైతులకు పెట్టుబడులు తగ్గించి పంట దిగుబ డి పెంచేందుకు ప్రభుత్వం 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని ఒప్పిచర్లలో చిరుమామిళ్ల సుబ్బయ్య పొలంలో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన పాల్గొని రైతులతో మాట్లాడారు. ఆధునిక సేద్యంపై ఏ విధంగా అడుగులు వేయాలో రైతులకు వివరించాలని వ్యవసాయ శాఖాధికారులకు సూచించారు. అనంతరం ఎమ్మెల్యే దుక్కి దున్నారు.

విద్యార్థులు క్రీడల్లో నైపుణ్యం సాధించాలి

విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో నైపుణ్యం సాధించి పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని ఎమ్మెల్యే అన్నారు. మంగళవారం కారంపూడిలోని బ్రహ్మనాయుడు జిల్లా పరిషత్ హైస్కూల్లో నిర్వహిస్తున్న ఆటల పోటీలను ఆయన రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ప్రభుత్వ పాఠశాలల్లో అత్యుత్తమ విద్యాబోధన చేయగల ఉపాధ్యాయులున్నారని, విశాలమైన ఆటస్థలంతోపాటు వసతులను కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేస్తోందని ఎమ్మెల్యే తెలిపారు. క్రీడాకారులను పరిచయం చేసుకొని పిన్నెల్లి శ్రీవిద్య అందించిన టీషర్టులను అందజేశారు. ఈ కార్యక్రమాల్లో టీడీపీ మండల అధ్యక్షుడు ఉన్నం లక్ష్మీనారాయణ, రాష్ట్ర కార్యదర్శి పంగులూరి అంజయ్య, పుల్లయ్య, చప్పిడి రాము, గోళ్ల సురేష్‌యాదవ్, బొల్నేడి శ్రీను, జనసేన సమన్వయకర్త బూసా రామాంజినేయులు, కేసనపల్లి కృష్ణబాబు, మనుగోడు సత్యం, నీలంజయ్య, కటికల బాలకృష్ణ, తండా మస్తాన్‌జాని, కొండపల్లి అప్పారావు, చిరుమామిళ్ల శ్రీను, బొల్నేడి హరికృష్ణ, లక్ష్మయ్య, ఎంపీడీవో గంటా శ్రీనివాసరెడ్డి, ఏవో యలమందారెడ్డి, ఏపీవో కోటిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో శరవేగంగా అభివృద్ధి, సంక్షేమం

దుర్గి, సెప్టెంబరు 24: రాష్ట్రంలో కూటమి వంద రోజులపాలనలో అభివృద్ధి, సంక్షేమం శరవేగంగా జరుగుతోందని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. మంగళవారం ముటుకూరులో జరిగిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసిన దుర్మార్గుడు జగన్ అని ఆగ్రహం వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం 100రోజుల పాలనలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అనుభవం, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ దృఢ సంకల్పంతో ఓ వైపు అభివృద్ధి పనులు చేస్తూ, మరోవైపు పేదలకు సంక్షేమ పథకాలు అందిస్తూ ప్రజల మన్ననలు పొందుతున్నారన్నారు. మేనిఫెస్టోలో పొందుపరిచిన సంక్షేమ పథకాలను అందిస్తామన్నారు. హిందువులు ఎంతో పవిత్రంగా భావించే తిరుమల తిరుపతి వేంకటేశ్వరస్వామి లడ్డు ప్రసాదాన్ని అపవిత్రం చేశారని, దీనికి బాధ్యులైన ప్రతి ఒక్కరికీ శిక్ష పడేలా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని అన్నారు. అనంతరం 317 మంది డ్వాక్రా మహిళలకు మంజూరైన రూ.3,10,50,000 విలువైన చెక్కులను అందజేశారు. అలాగే మండలంలోని కోలగుట్లలో నిర్వహించిన పొలం పిలుస్తోంది.. కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని డ్రోన్‌ల ద్వారా పురుగు మందుల పిచికారి చేసే కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ సునీతా సాయిశంకర్, సర్పంచ్ దొండపాటి చెన్నయ్య, రమేష్, వెలిదండి శ్రీనివాసరావు, తోటకూర శ్రీను, పులి హరి, రుద్రాల రవి, సాంబశివరావు పాల్గొన్నారు.

ఆలయ పునర్నిర్మాణానికి కృషి చేస్తా

రెంటచింతల, సెప్టెంబరు 24: మండలంలోని పశర్లపాడులో ఉన్న అతి పురాతనమైన శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయాన్ని ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి సందర్శించారు. పేరుగాంచిన ఆలయం శిథిలావస్థకు చేరిందని పునర్నిర్మాణ పనులను చేపట్టాలని గ్రామస్థులు కోరగా ఎమ్మెల్యే అంగీకరించారు. దాతలు ముందుకొస్తే ప్రభుత్వ పరంగా తన వంతు సహాయ సహకారాలందిస్తానని హామీనిచ్చారు. ఆయన వెంట సీనియర్ టీడీపీ నేత కాపూరి నాగయ్య చౌదరి, దొండపాటి శివనాగు, మాజీ డీసీ చైర్మన్ నల్లబిరుదు నరసింహారావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

కమీషన్‌ల కక్కుర్తితో వెంకన్న సన్నిధిలో కల్తీ పనులు

● ఇప్పటికే ప్రజాకోర్టులో శిక్ష పడిన జగన్.. దేవుడి కోర్టులో శిక్షకు రెడీగా ఉండాలి

● ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ



దూళిపాళ్ళలో జరిగిన సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ

సత్తెనపల్లి రూరల్, సెప్టెంబరు 24: అధికారం ఉందనే అహంకారంతో కొవ్వు ఎక్కువై కమీషన్‌ల కోసం కక్కుర్తిపడి కలియుగ ప్రత్యక్ష దైవం వెంకన్న సన్నిధిలో కల్తీ పనులు చేసిన దుర్మార్గుడు జగన్ అని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ తీవ్రంగా మండిపడ్డారు. మండలంలోని ధూళిపాళ్ళలో మంగళవారం ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ కల్తీ పనులు చేసి అడ్డంగా దొరికిపోయే సరికే ఫేక్ ముఠాలను రంగంలోకి దించి తప్పుడు సమాచారాన్ని సోషల్ మీడియాలో వ్యాప్తి చేస్తున్నాడని జగన్‌ను తీవ్రంగా విమర్శించారు. సంక్షోభంలో సంక్షేమం అందిస్తున్న ఘనత కూటమి ప్రభుత్వానిదేనని అన్నారు. ప్రజా ప్రభుత్వ వంద రోజుల పాలనలో ప్రజలు సంతృప్తిగా ఉండి ఇది మంచి ప్రభుత్వమని ప్రశంసిస్తున్నారన్నారు. ఆయన ఇంటింటికి వెళ్ళి వంద రోజుల పాలనలో చేసిన అభివృద్ధి, సాధించిన విజయాలు, గురించి ప్రజలకు వివరించారు. కరపత్రాలను ప్రజలకు అందజేశారు. ప్రజల సమ్మతితో ఇంటి గోడలకు ఇది మంచి ప్రభుత్వం స్టిక్కర్లను అంటించారు. గ్రామంలో సీసీ డ్రెయిన్స్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు ఆళ్ళ అమరేశ్వరరావు, జనసేన నియోజకవర్గ సమన్వయ కర్త బొర్రా వెంకట అప్పారావు, జనసేన మండల అధ్యక్షుడు నాదెండ్ల నాగేశ్వరరావు, టీడీపీ నాయకులు కోమటినేని శ్రీనివాసరావు, కట్టా రమేష్, దరువూరి నాగేశ్వరరావు, బద్దుల హనుమంతరావు, తహసీల్దార్ కేఎస్ చక్రవర్తి, ఎంపీడీవో సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

లాభసాటి వ్యవసాయం చేయాలి

తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధిస్తూ ప్రతి ఒక్క రైతు లాభసాటి వ్యవసాయం చేయాలని ఎమ్మెల్యే అన్నారు. మండలంలోని కంటెపూడిలో మంగళవారం జరిగిన పొలం పిలుస్తుంది కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కన్నా మాట్లాడుతూ వ్యవసాయ అధికారులు సలహాలు, సూచనలు పాటిస్తూ వ్యవసాయం చేయాలని, పంటల మార్పిడి విధానాన్ని అవలంబించాలన్నారు. ప్రభుత్వం కూడా వ్యవసాయ రంగానికి పెద్దపీట వేసిందని, రైతులకు మేలు చేసేది కూటమి ప్రభుత్వం అన్నారు. ముందుగా గ్రామంలో సాగులో ఉన్న పత్తి పంటను వ్యవసాయ శాఖ అధికారులతో కలసి క్షేత్ర స్థాయిలో ఆయన పరిశీలించారు. రైతులతో మాట్లాడారు. ఆయన వెంట తెలుగురైతు రాష్ట్ర కార్యదర్శి కోమటినేని శ్రీనివాసరావు, మండల అధ్యక్షుడు ఆళ్ళ అమరేశ్వరరావు, మదమంచి రాంబాబు, కోయా లక్ష్మయ్య, బండారుపల్లి నరసింహారావు, ఇన్‌చార్జ్ ఏడీఏ, వ్యవసాయశాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

అన్యాక్రాంతమైన ప్రభుత్వ భూముల జాబితాలను వెల్లడించండి

సర్వసభ్య సమావేశంలో అధికారులను ప్రశ్నించిన పిల్లుట్ల సర్పంచ్



సమావేశంలో అధికారులను ప్రశ్నిస్తున్న సర్పంచ్ శివపార్వతి సాంబశివరావు

మాచవరం, సెప్టెంబరు 24 : ఐదు సంవత్సరాల వైసీపీ ప్రభుత్వంలో అన్యాక్రాంతమైన ప్రభుత్వ భూముల జాబితాలను వెల్లడించి వాటిని రక్షించాలని పిల్లుట్ల సర్పంచ్ లఘువరపు శివపార్వతి సాంబశివరావు అధికారులను ప్రశ్నించారు. మంగళవారం ఎంపీపీ దారం అంబులమ్మ అధ్యక్షతన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం జరిగింది. ముందుగా అధికారులు వారి వారి శాఖలకు సంబంధించిన సమాచారాన్ని సభలో సభ్యులకు వివరించారు. అనంతరం పిల్లుట్ల సర్పంచ్ మాట్లాడుతూ గత ఐదు సంవత్సరాల వైసీపీ ప్రభుత్వ పరిపాలనలో మండలంలోని పలు గ్రామాల్లో ప్రభుత్వ భూములను వైసీపీ నాయకులు వారి పేర్లపై ఆన్‌లైన్‌లో నమోదు చేయించుకొని వివిధ బ్యాంకుల్లో లక్షలాది రూపాయల రుణాలు పొందారని ఆరోపించారు. గ్రామాల వారీగా రెవెన్యూ అధికారులు రికార్డులు పరిశీలించి ప్రభుత్వ భూముల్లో నమోదైన వైసీపీ నాయకుల పేర్లు తొలగించి రికార్డుల్లో ప్రభుత్వ భూములుగా చూపాలన్నారు. అంతేగాకుండా ఆయా బ్యాంకుల్లో తీసుకున్న రుణాలను కూడా రికవరీ చేయించే విధంగా బ్యాంకు అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఇప్పటికైనా రెవెన్యూ అధికారులు ఆయా గ్రామాల భూ రికార్డులు తనిఖీ చేసి ప్రభుత్వ భూముల్లో నమోదైన పేర్లు తొలగించాలని, లేని ఎడల స్థానిక రెవెన్యూ అధికారులపై జిల్లా అధికారులకు ఫిర్యాదు చేయాల్సి వస్తుందని సభలో పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఎంపీడీవో శ్రీనివాసరావు, జడ్పీటీసీ శివయాదవ్, కొల్లి కృష్ణమూర్తి, కో-ఆప్షన్ సభ్యులు జానీ, యడ్లపల్లి రామారావు, మాలపాటి మల్లయ్య, చిట్టిప్రోలు నరసింహారావు, ఈవోఆర్‌డీ వెంగళరావు, పలు ప్రభుత్వ శాఖల అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

'ఇది మంచి ప్రభుత్వం' వాల్ పోస్టర్ ఆవిష్కరణ



పిడుగురాళ్లలో వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కూటమి నేతలు

పిడుగురాళ్ల, సెప్టెంబరు 24: చంద్రబాబు అధికారంలోకి వచ్చి 100 రోజుల పాలనలో సాధించిన విజయాలపై పిడుగురాళ్ల పట్టణ, గ్రామాల్లో మంగళవారం కూటమి నేతలు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. చంద్రబాబు అధికారంలోకి వచ్చాక అన్నివర్గాలకు మేలు కలిగే విధంగా పాలన కొనసాగిస్తున్నారని కూటమి నేతలు పాండురంగ శ్రీను, సయ్యద్ అమీర్‌అలీ, పిల్లి చెన్నారావు, వేముల అంజనేయులు, పణితి రవిలు తెలిపారు. పట్టణంలోని 10, 11, 12 వార్డుల సచివాలయాల వద్ద ఇంటింటికి స్టిక్కర్లను అంటించారు. కార్యక్రమంలో కొమ్మినేని రామచంద్రరావు, వడ్డవల్లి సాంబశివరావు, కామిశెట్టి రమేష్, బీజేపీ నాయకుడు ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పథకాల అమల్లో లోపం లేకుండా చూడాలి : ఎంపీపీ

పిడుగురాళ్ల, సెప్టెంబరు 24: లబ్ధిదారులకు, పేదలకు అందించే ప్రభుత్వ పథకాల్లో ఎటువంటి లోపాలు లేకుండా చూడాలని పిడుగురాళ్ల ఎంపీపీ గార్లపాటి అనసూర్య తెలిపారు. మంగళవారం మండల పరిషత్ సమావేశంలో ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను లబ్ధిదారులకు అందించేందుకు అధికారులు కృషి చేయాలన్నారు. సమావేశంలో ఎంపీడీవో కాశయ్య, ఉప ఎంపీపీ సాతులూరి బాబు, ఎంఈవో శ్రీనివాసరెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ అలెక్స్, పంచాయతీ కార్యదర్శులు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

నాగార్జున సాగర్ నీటి సమాచారం

మాచర్ల రూరల్, సెప్టెంబరు 24: నాగార్జున సాగర్ జలాశయం నీటి మట్టం మంగళవారం నాటికి 589.30 అడుగులు ఉంది. ఇది 309.95 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 10,200 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 3849, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 28,217, ఎస్‌ఎల్‌బీసీ ద్వారా 1800, ఎల్‌ఎల్‌సీ ద్వారా 600, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్‌గా 44,666 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి సాగర్‌కు ఇన్‌ఫ్లోగా 44,666 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.

పొంగి పొర్లిన వాగులు.. నీట మునిగిన పంట పొలాలు

● రచ్చమలపాడు వాగును పరిశీలించిన ఎమ్మెల్యే

వెల్దుర్తి, సెప్టెంబరు 24: మండలపరిధిలో సోమవారం రాత్రి కురిసిన వర్షానికి వాగులు పొంగిపొర్లాయి. దీంతో లోతట్టు ప్రాంతాలు, పంట పొలాలు నీట మునిగాయి. ప్రధానంగా రచ్చమలపాడు వాగు ఉధృతంగా ప్రవహించడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. సమీపంలోని పొలాలు నీట మునిగాయి. అలాగే పట్లవీడు వాగు కూడా ఉధృతంగా ప్రవహించింది. భారీగా నీరు చేరడంతో వాగు అలుగు పారింది. ఉప్పలపాడు బొత్తలవాగు, ఎర్రవాగు, బోదలవీడు వాగు, గుండ్లపాడు వాగులు వర్షపునీటితో ఉధృతంగా ప్రవహించాయి. రాకపోకలకు అంతరాయం కలిగింది. రచ్చమలపాడు వాగు ఉధృతిని ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి పరిశీలించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

పొంగిపొర్లిన చంద్రవంక



పొంగిపొర్లుతున్న చంద్రవంక

మాచర్లటౌన్, సెప్టెంబరు 24: పట్టణంలో సోమవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి చంద్రవంక నది పొంగి పొర్లింది. పట్టణం నుంచి జమ్మలమడక వెళ్లే రహదారిలో చప్టాపై నుంచి చంద్రవంక ఉధృతంగా ప్రవహించింది. మున్సిపల్ చైర్మన్ పోలూరి నరసింహారావు, కమిషనర్ నాగేశ్వరరావు, తహసీల్దార్ జియావుల్‌హక్, పట్టణ సీఐ ప్రభాకరరావు, ఆర్‌ఐ నిమ్మల శ్రీనివాసరావు తదితరులు చప్టా వద్దకు చేరుకొని పర్యవేక్షించారు. రాకపోకలు జరగకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

అభివృద్ధి, సంక్షేమమే కూటమి లక్ష్యం

● ఇది మంచి ప్రభుత్వం సభలో ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్



సమావేశంలో మాట్లాడుతున్న పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్

బెల్లంకొండ, సెప్టెంబరు 24: అభివృద్ధి, సంక్షేమమే కూటమి లక్ష్యమని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ అన్నారు. మంగళవారం బెల్లంకొండ మండలంలోని పాపాయపాలెం గ్రామంలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం నారా చంద్రబాబునాయుడు వంద రోజుల్లోనే ఇచ్చిన హామీలను తూచా తప్పకుండా అమలు చేశారన్నారు. ప్రజా సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను తప్పకుండా నెరవేరుస్తామని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పలు సంక్షేమ పథకాలతో కూటమి ప్రభుత్వం ప్రజలతో మంచి ప్రభుత్వం అనిపించుకుంటుందన్నారు. పింఛన్ల పెంపు, అన్న క్యాంటీన్ల ఏర్పాటు, మెగా డీఎస్సీ, ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ రద్దు వంటి అనేక సంక్షేమ కార్యక్రమాలతో ముందుకు సాగుతున్నారన్నారు. నియోజకవర్గంలో ఇప్పటికే రూ.12 కోట్లతో అభివృద్ధి కార్యక్రమాలను చేస్తున్నామని తెలిపారు. మండలంలో రూ1.50 కోట్లతో చంద్రాజుపాలెం నుంచి పాపాయపాలెం వెళ్లే రహదారి నిర్మాణం చేపడుతున్నట్టు తెలిపారు. పాపాయపాలెం గ్రామంలో రూ.20 లక్షలతో అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతున్నట్టు తెలిపారు. అనంతరం గ్రామంలో పర్యటించి ప్రజల సమస్యలు తెలుసుకొని పరిష్కారమార్గం చూపిస్తామని తెలిపారు. ఆయా కార్యక్రమాల్లో గుంటూ రు మిర్చియార్డు మాజీ చైర్మన్ వెన్నా సాంబశివారెడ్డి, రాష్ట్ర మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి పీఎస్‌కే మస్తాన్ షరీఫ్, మండల అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, వెన్నా సీతారామిరెడ్డి, తెలుగుయువత నాయకుడు పీఎస్‌కే రసూల్, బీసీ సంఘం నేత గంగాధర్, గుడిసె కొండయ్య, ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

రైతులను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుంది

రైతులను అన్నివిధాలా ప్రభుత్వం ఆదుకుంటుందని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ తెలిపారు. గుంటూరు మిర్చి యార్డు మాజీ చైర్మన్ వెన్నా సాంబశివారెడ్డితో కలసి పాపాయపాలెంలో పొలం పిలుస్తుంది కార్యక్రమం ఏర్పాటు చేశారు. క్రోసూరు ఏడీఏ హనుమంతరావు ఆధ్వర్యంలో బొప్పాయతోటను పరిశీలించారు. ఎమ్మెల్యే రైతులతో చర్చించారు.

బాగా చదువుకుంటే మంచి భవిష్యత్తు

బాగా చదువుకుంటే విద్యార్థులకు మంచి భవిష్యత్తు ఉంటుందని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ అన్నారు. మంగళవారం పాపాయపాలెం గ్రామానికి వచ్చిన ఎమ్మెల్యేకి జిల్లా పరిషత్ పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. విద్యార్థులు బాగా చదువుకొని పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు ప్రతిష్టలు తేవాలని సూచించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులందరూ ఎమ్మెల్యే ప్రవీణ్, వెన్నా సాంబశివారెడ్డిలను సత్కరించారు. కార్యక్రమంలో క్రోసూరు ఏడీఏ హనుమంతరావు, ఎంపీడీవో వెంకటరెడ్డి, తహసీల్దార్ జాస్మిన్ బేగం, ఏవో కృష్ణయ్య, పంచాయతీ సెక్రటరీ గిరిధర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, ఓర్చు ఆనంద్, వెన్నా సీతారామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాహుల్‌గాంధీ వ్యాఖ్యలపై బీజేపీ నిరసన



అమరావతిలో నిరసన తెలుపుతున్న బీజేపీ నాయకులు

అమరావతి, సెప్టెంబరు 24: రిజర్వేషన్‌లపై అమెరికాలో రాహుల్‌గాంధీ చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ బీజేపీ ఆధ్వర్యంలో పెదమద్దూరు రోడ్డు సెంటర్లో నిరసన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు ఆలోకం సుధాకర్‌బాబు ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. రాహుల్‌గాంధీ వ్యాఖ్యలతో రిజర్వేషన్‌లపై కాంగ్రెస్ నిజస్వరూపం బయటపడిందని అన్నారు. ప్రతిపక్ష హోదాలో ఉన్న రాహుల్‌గాంధీ రిజర్వేషన్‌లను వ్యతిరేకించడం అధికారంలోకి వస్తే రద్దు చేస్తామనడం ఏమిటని ప్రశ్నించారు. రాహుల్‌గాంధీ బడుగు బలహీన వర్గాలప్రజలకు క్షమాపణ చెప్పాలని లేనిచో ఆయనపై పోలీసుస్టేషన్లలో ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పి.పూర్ణచంద్రరావు, వి.రవిశంకర్, ఎం హనుమంతరావు, ధాత్రినారాయణ తదితరులు పాల్గొన్నారు.

దేవుడి సన్నిధిలో శిక్ష తప్పదని గుర్తుంచుకోవాలి

● టీడీపీ నియోజకవర్గ నాయకుడు డాక్టర్ వడ్డెంపూడి

రాజుపాలెం, సెప్టెంబరు 24: కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీవేంకటేశ్వరస్వామి ప్రసాదంతో ఆడుకున్న మాజీ సీఎం జగన్మోహన్‌రెడ్డి, అనుచరులకు దేవుడి సన్నిధిలో శిక్ష తప్పదని టీడీపీ నియోజకవర్గ నాయకుడు డాక్టర్ వడ్డెంపూడి పవన్‌కుమార్ హెచ్చరించారు. మంగళవారం పవన్‌కుమార్ రాజుపాలెంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ వైసీపీ నేతలు చేసిన తప్పుడు పనుల వల్ల కోట్ల మంది ప్రజల మనోభావాలు దెబ్బతిన్నాయన్నారు. తప్పు చేయకపోతే వైవీ సుబ్బారెడ్డి విజిలెన్స్ విచారణ ఆపమని కోర్టుకు ఎందుకు వెళ్లాడని నిలదీశారు. జగన్ టీమ్ అక్రమాలన్నీ బయటకు వస్తాయని స్పష్టం చేశారు.

అపహాస్యంగా మాట్లాడటం అహంకారానికి నిదర్శనం

క్రోసూరు, సెప్టెంబరు 24: తిరుపతి లడ్డును వైసీపీ నాయకులు అపహాస్యం చేశారని, ఇది వారి అహంకార పూరిత ధోరణికి నిదర్శనమని క్రోసూరు మార్కెట్ యార్డు మాజీ చైర్మన్‌లు కాంధ్రు కాశయ్య, ఏపూరి నాగేశ్వరరావు విమర్శించారు. పలువురు టీడీపీ నాయకులతో కలసి మంగళవారం క్రోసూరులో వారు విలేకరులతో మాట్లాడుతూ కలియుగ ప్రత్యక్ష దైవం వేంకటేశ్వరుడు ఐదు సంవత్సరాలుగా వైసీపీ నాయకులు చేసిన అరాచకాలను, దుర్మార్గాలను గ్రహిస్తూ వచ్చాడని, ఈ ఎన్నికల్లో వైసీపీకి కనీసం ప్రతిపక్ష స్థానం కూడా దక్కకుండా దారుణంగా ఓడించాడని ఈ సందర్భంగా వారు అన్నారు.

కూటమి నేతల ప్రత్యేక పూజలు

గురజాలటౌన్, సెప్టెంబరు 24: తిరుమల తిరుపతి వేంకటేశ్వరస్వామి లడ్డు ప్రసాదంలో కల్తీ నెయ్యి వినియోగంవల్ల అపచారం జరిగినందుకు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ చేపట్టిన ధర్మ దీక్షకు గురజాల కూటమి నేతలు మద్దతుగా నిలిచారు. పట్టణంలోని పాతపాటేశ్వరి అమ్మవారి ఆలయం వద్ద జనసేన పార్టీ సమన్వయకర్త కటకం అంకారావు ఆధ్వర్యంలో హోమం నిర్వహించారు. కార్యక్రమంలో జనసేన జిల్లా కార్యదర్శి బి.శ్రీనివాసరావు, మండల అధ్యక్షుడు ఉప్పిడి నరసింహారావు, హైకోర్టు ఏజీపీ శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



డ్వాక్రా రుణాల చెక్కును అందజేస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

స్వర్ణాంధ్రను సాకారం చేయడమే ప్రభుత్వ లక్ష్యం

● పల్నాడు జిల్లా టీడీపీ అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్

వేల్పూరు (శావల్యాపురం), సెప్టెంబరు 24: రాష్ట్రాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి పథంలో తీర్చిదిద్దటమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని పల్నాడు జిల్లా టీడీపీ అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్ అన్నారు. జడ్పీటీసీ పారా హైమావతి ఆధ్వర్యంలో శావల్యాపురం మండలం వేల్పూరులో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ముఖ్య అతిధులుగా ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు, కొమ్మాలపాటి శ్రీధర్, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావులు పాల్గొని కరపత్రాలు పంపిణీ చేశారు. అనంతరం బహిరంగసభలో స్వర్ణాంధ్ర విజన్ 2047, పొలం పిలుస్తోంది, డ్వాక్రా మహిళలకు ప్రభుత్వం మంజూరుచేసిన రుణాల చెక్కును ఆవిష్కరించారు. గర్భిణులు, బాలింతలకు ఎమ్మెల్యే, కలెక్టర్ పౌష్టికాహారాన్ని అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు గుంటూరు సాంబశివరావు, జనసేన నాయకులు నాగశ్రీనురాయల్ తదితరులు పాల్గొన్నారు.

చిలకలూరిపేట మునిసిపల్ డీఈగా అబ్దుల్ రహీమ్

చిలకలూరిపేట, సెప్టెంబరు 24: చిలకలూరిపేట మునిసిపల్ డీఈగా షేక్ అబ్దుల్ రహీమ్ మంగళవారం నియమితులయ్యారు. మంగళగిరి తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్ నుంచి ఆయన ఇక్కడకు బదిలీ అయ్యారు. ఇప్పటివరకు ఇక్కడ డీఈ గా ఉన్న టి.వెంకట రమణ సత్తెనపల్లి మునిసిపాలిటీకి బదిలీ అయ్యారు.

సీఎం సహాయనిధికి రూ.2లక్షల విరాళం



వరద బాధితుల సహాయార్థం ప్రత్తిపాటికి చెక్కులను అందజేస్తున్న దాతలు

చిలకలూరిపేట, సెప్టెంబరు 24: విజయవాడ వరద బాధితులను ఆదుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వ కృషికి తోడు దాతలు అందిస్తున్న సహకారం ఎప్పటికీ మరిచిపోలేనిదని స్థానిక శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు మంగళవారం అన్నారు. వరద బాధితుల సహాయార్థం మండలంలోని మానుకొండవారిపాలెం టీడీపీ నాయకులు రూ.లక్ష, స్థానిక అశోక కాఫీ సంస్థ అధినేత మున్నలూరి కుమారస్వామి రూ.లక్ష చొప్పున విరాళాల చెక్కులను ప్రత్తిపాటికి అందించారు. చెక్కులను ముఖ్యమంత్రి సహాయ నిధికి పంపుతామని ప్రత్తిపాటి తెలిపారు. దాతలను ప్రత్తిపాటి అభినందించారు.

వేద పండితుల రుద్రపారాయణం

ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు మాతృమూర్తి ప్రత్తిపాటి నారాయణమ్మ ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతూ మంగళవారం వేదపండితులు ఇక్కడి పండరీపురం లోని ప్రతిపాటి నివాస గృహంలో రుద్ర పారాయణం చేశారు. కాగా బుధవారం ప్రత్తిపాటి నివాస గృహంలో నారాయణమ్మ పెద్దకర్మ జరగనుంది.

వరద బాధితులకు నిత్యావసరాలు, దుస్తులు సాయం



వాహనాలకు జెండా ఊపి ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి

నరసరావుపేట టౌన్, సెప్టెంబరు 24: విజయవాడ వరద బాధితులకు నిత్యావసరాలు, దుస్తులు పంపిణీ నిమిత్తం రెండు వాహనాలతో బయలుదేరిన వాహనాలను మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి జెండా ఊపి మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ సెప్టెంబరు 12న తన జన్మదినోత్సవాన్ని రద్దు చేసుకొని వరద బాధితులకు సాయంచేద్దామని పిలుపునివ్వటంతో కార్యకర్తలు, నాయకులు పెద్దఎత్తున స్పందించారన్నారు. రూ.10లక్షలకు సరిపడా నిత్యావసరాలు, ఏడు రకాల వస్తువులను రెండు వాహనాల్లో విజయవాడకు పంపామన్నారు. సాయంచేసిన వైసీపీ కార్యకర్తలు, అభిమానులు, నాయకులకు ఎమ్మెల్యే ధన్యవాదాలు తెలిపారు.

పొలం పిలుస్తోంది.. ప్రారంభం

● సాగు వ్యయం తగ్గించి.. దిగుబడి పెంచటమే లక్ష్యం



యలమందలలో పొలం పిలుస్తోందిలో పాల్గొన్న కలెక్టర్ అరుణ్‌బాబు, ఎమ్మెల్యే డాక్టర్ అరవిందబాబు, జేడీ మురళి

నరసరావుపేట, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): వైసీపీ హయాంలో ఐదేళ్లు గాలికొదిలేసిన వ్యవసాయాన్ని గాడిన పెట్టేందుకు కూటమి ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించింది. అస్తవ్యస్తంగా మారిన వ్యవసాయ రంగానికి పూర్వవైభవం తీసుకువచ్చేందుకు ప్రభుత్వం పొలం పిలుస్తోంది పేరుతో వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. రైతులకు సాగులో ఎదురవుతున్న ఆటంకాలు, ఇబ్బందులను అధిగమించేందుకు ఈ కార్యక్రమం దోహదపడుతుందని ప్రభుత్వం భావిస్తోంది. వ్యవసాయ శాఖతో పాటు మొత్తం 14 శాఖల అధికారులు అన్నదాతలకు అండగా నిలువనున్నారు. జిల్లా అంతటా రైతుల సమక్షంలో మంగళవారం పొలం పిలుస్తోంది కోలాహలంగా ప్రారంభమైంది. జిల్లాలోని 28 మండలాల్లో పొలం పిలుస్తోంది నిర్వహణకు రూ.47 లక్షలు మంజూరయ్యాయి. ఖరీఫ్, రబీ సీజన్లలో నాలుగు నెలలపాటు వారంలో ప్రతి మంగళ, బుధవారాల్లో, రోజుకు రెండు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించాలని అధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఏ రోజు ఏ గ్రామంలో పొలం బాట పట్టాలని ముందస్తుగా ఎంపిక చేశారు. కార్యక్రమంలో భాగస్వాములు కావాలని రైతులకు ముందుగా సమాచారం ఇస్తారు.

ప్రారంభించిన కలెక్టర్ అరుణ్‌బాబు

నరసరావుపేట మండలం యలమందలలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని కలెక్టర్ పీ అరుణ్‌బాబు ప్రారంభించారు. పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని సద్వినియోగపరుచుకోవాలని రైతులకు కలెక్టర్ సూచించారు. శాస్త్రవేత్తల సలహాలను పాటించడం ద్వారా రైతులు సాగు వ్యయాన్ని తగ్గించుకుని, అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు మాట్లాడుతూ వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకే ప్రభుత్వం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ ఏడీ ఐ మురళి వివిధ శాఖ అధికారులు పాల్గొన్నారు.

● రొంపిచర్ల: వ్యవసాయ శాఖ అధికారుల సూచనలు, సలహాలు పాటించి అధిక దిగుబడులు సాధించాలని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద పేర్కొన్నారు. విప్పర్ల గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వ్యవసాయశాఖ శాస్త్రవేత్త కట్ట శ్రీరాములు, ఏడీఏ మస్తానమ్మ రైతులు పాటించాల్సిన యాజమాన్య పద్ధతుల గురించి వివరించారు. కార్యక్రమంలో రాష్ట్రంలో టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి గోనుగుంట్ల కోటేశ్వరరావు, గాడిపర్తి సురేష్, జెల్లిపల్లి శేషమ్మ, ఇమ్మడిశెట్టి కాశయ్య, రామిశెట్టి కోటయ్య, ఏడీఏ మస్తానమ్మ, ఏవో శివలీల తదితరులు పాల్గొన్నారు.

● నాదెండ్ల: రైతులందరూ పత్తి పైరులో సామూహికంగా లింగాకర్షణ బుట్టలు ఏర్పాటు చేసుకుంటే సత్ఫలితాలు లభిస్తాయని వ్యవసాయ అధికారి ఏ హరిప్రసాదు అన్నారు. మండలంలోని నాదెండ్ల, ఎండుగుంపాలెం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. పశు వైద్యులు డాక్టర్ లక్ష్మి, డాక్టర్ సీహెచ్ సాంబశివారెడ్డిలు నత్తల నివారణ, రాబీస్ వ్యాక్సిన్‌పై పశు పోషకులకు అవగాహన కల్పించారు. కార్యక్రమాల్లో ఎంపీడీవో జాకీర్ హుస్సేన్, సర్పంచ్ కోటేశ్వరరావు, ఉప సర్పంచ్ పాటిబండ్ల రామారావు, నల్లమోతు హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

● శావల్యాపురం: పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని రైతులంతా సద్వినియోగం చేసుకోవాలని మండల ఇన్‌చార్జి వ్యవసాయశాఖాధికారి రామినేని రామారావు కోరారు. మండలంలోని వేల్పూరు, శావల్యాపురం గ్రామాలలో పంట పొలాలను వ్యవసాయశాఖాధికారులు మంగళవారం పరిశీలించారు. ఇన్‌చార్జి ఎంఏవో మాట్లాడుతూ రైతులు సాగుచేసిన పంటలకు ఏవైనా సమస్యలుంటే వ్యవసాయశాఖ సిబ్బందికి తెలియజేయాలన్నారు.

రాష్ట్రాన్ని సర్వ నాశనం చేసిన జగన్మోహనరెడ్డి

వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు

వేల్పూరు (శావల్యాపురం), సెప్టెంబరు 24: ఒక్క చాన్సంటూ 2019లో అధికారంలోకి వచ్చిన జగన్మోహన్‌రెడ్డి ఇసుక, మద్యం, రేషన్ మాఫియాలతో లక్షలకోట్లు దోచుకొని రాష్ట్రాన్ని సర్వనాశం చేశాడని ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు విమర్శించారు. శావల్యాపురం మండలంలోని వేల్పూరులో మంగళవారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఐదేళ్ళపాలనలో రాష్ట్రాన్ని రూ.14లక్షల కోట్ల అప్పుల ఊబిలోకి నెట్టి వెళ్ళిపోయాడని, అమరావతి, పోలవరాన్ని నాశనం చేసి రాష్ట్రాన్ని అంధకారంలోకి నెట్టాడన్నారు. ముగ్గురు ఐపీఎస్ అధికారులను అడ్డు పెట్టుకొని సినీనటి జత్వానీపై తప్పుడు కేసులుపెట్టి వేధింపులకు గురిచేశారని, రక్షించాల్సిన పోలీసు ఉన్నతాధికారులు దీనిలో ప్రముఖపాత్ర పోషించి పోలీస్‌శాఖ పరువుతీశారన్నారు. యువతకు గంజాయి, మద్యం, గుట్కాలు అలవాటు చేసి వారి భవిష్యత్తును దెబ్బతీశారన్నారు. కూటమి ప్రభుత్వం త్వరలో వీటన్నింటినీ పరిష్కరించి ప్రజలకు సుపరిపాలనను అందిస్తుందన్నారు.

పల్నాడు జిల్లా టీడీపీ అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్ మాట్లాడుతూ 2019 ఎన్నికల్లో జగన్మోహన్‌రెడ్డి పింఛన్‌లను రూ.1000 పెంచడానికి ఐదేళ్ళు పట్టిందని, అధికారంలోకి వచ్చిన 100రోజుల్లోనే పింఛన్‌లను పెంచిన ఘనత చంద్రబాబుకే దక్కుతుందన్నారు. జగన్మోహన్‌రెడ్డి ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను తెచ్చి ప్రజల ఆస్తులను కాజేసేందుకు ప్రయత్నించాడని, చంద్రబాబు రాగానే యాక్ట్‌ను రద్దుచేసి ప్రజలకు వారి ఆస్తులపై భరోసా కల్పించారన్నారు.

నియోజకవర్గ చెస్, యోగా జట్ల ఎంపిక



ఎంపికైన చెస్ క్రీడాకారుల జట్టుతో ఉపాధ్యాయులు

నాదెండ్ల, సెప్టెంబరు 24: మండలంలోని అమీన్‌సాహెబ్‌పాలెం జడ్పీ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో జరిగిన చెస్, యోగా జట్ల పోటీలు మంగళవారం జరిగాయి. అండర్-14, అండర్-17 విభాగంలో జరిగిన పోటీల్లో చెస్, యోగా జట్లకు విద్యార్థులను ఎంపిక చేశారు. ఈ పోటీలకు నియోజకవర్గంలోని 150మంది విద్యార్థులు హాజరయ్యారు. ఈ పోటీలను గ్రామ సర్పంచ్ కామినేని లలిత నాగేశ్వరరావు, ఎస్ఎంసీ చైర్మన్ కామినేని సురేష్‌బాబులు ప్రారంభించారు. కాగా హెచ్ఎం కొల్లి పద్మజ, జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శి సురేష్‌కుమార్, బీ శ్రీనివాస్, షేక్ ఇస్మాయిల్, పొదిలి వెంకటేశ్వర్లు, ఫిలిప్ రాజు, షేక్ ఖాశింబుడేలు పర్యవేక్షించారు.

ఏడు సంవత్సరాల క్రితం అదృశ్యమైన వ్యక్తి ఆచూకీ లభ్యం

నరసరావుపేట లీగల్, సెప్టెంబరు 24, కుటుంబ కలహాల నేపథ్యంలో ఏడు సంవత్సరాల క్రితం ఇంటి నుంచి వెళ్లిపోయిన వ్యక్తిని నరసరావుపేట మొదటి పట్టణ పోలీసులు ఆచూకీ కనుగొన్నారు. మొదటి పట్టణ సీఐ ఎంవీ చరణ్ కథనం ప్రకారం పట్టణంలోని రామిరెడ్డిపేటకు చెందిన జోసెఫ్ దేవదానం కుటుంబ కలహాల నేపథ్యంలో ఏడు సంవత్సరాల క్రితం ఇంటి నుంచి వెళ్లిపోయారు. 2017లో ఈ మేరకు మొదటి పట్టణ పోలీస్ స్టేషన్లో కేసు నమోదైంది. ఇటీవల మొదటి పట్టణ సీఐ జోసెఫ్ హైదరాబాదులో వైద్యశాలలో ఉద్యోగం చేస్తున్నట్లు సమాచారం లభించటంతో ఆ వ్యక్తి ఆచూకీ కనుగొని మంగళవారం అతని కుటుంబ సభ్యులకు అప్పగించారు.

యలమంద నిప్స్ ఫార్మశీలో స్వచ్ఛత హీ సేవ

నరసరావుపేట టౌన్, సెప్టెంబరు 24: ఎన్ఎస్ఎస్ డే సందర్భంగా నిప్స్ ఫార్మశీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో యలమందలో విలేజ్ క్లినిక్, పంచాయతీ కార్యాలయం, పరిసర ప్రాంతాలలో స్వచ్ఛత హీ సేవ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ జేఎన్ సురేష్‌కుమార్, కో ఆర్డినేటర్ లాజర్, కళాశాల వైస్‌చైర్మన్ మిట్టపల్లి చక్రవర్తి, అధ్యాపకుడు రవికాంత్, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.

జాతీయస్థాయి ఫ్లోర్‌బాల్ పోటీలకు ధనలక్ష్మి ఎంపిక

యడ్లపాడు, సెప్టెంబర 24: యడ్లపాడు మండలానికి చెందిన కోడిరెక్క ధనలక్ష్మి జాతీయస్థాయి ఫ్లోర్‌బాల్ పోటీలకు ఎంపికైంది. ఈ నెల ఒకటో తేదీన నరసరావుపేటలోని కేసానుపల్లిలోని ఇంటర్నేషల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో అండర్-14, అండర్-19 బాలబాలికల 18వ రాష్ట్ర స్థాయి ఫ్లోర్ బాల్ పోటీలను నిర్వహించారు. ఈ పోటీలలో రాష్ట్రంలోని 15జిల్లాల నుంచి క్రీడాకారులు పాల్గొన్నారు. అండర్-19 విభాగంలో యడ్లపాడు గ్రామానికి చెందిన కోడిరెక్క ధనలక్ష్మి ఎంపికైంది. ఈ నెల 27, 28, 29 తేదీలలో తమిళనాడు రాష్ట్రం చెంగల్‌పట్టులో జరిగే జాతీయస్థాయి పోటీలలో పాల్గొననుంది. ధనలక్ష్మిని బోయపాలెం గ్రామంలోని విశ్వతేజ స్పిన్నింగు మిల్లులో మంగళవారం అభినందించి, మిల్లు ఎండీ చంద్రశేఖర్ ఆర్థికసాయన్ని అందించారు.

ప్లాస్టిక్ వినియోగం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన

వినుకొండ టౌన్, సెప్టెంబరు 24: మండలంలోని చాట్రగడ్డపాడు గ్రామంలో స్వచ్ఛత హీ సేవా కార్యక్రమంలో భాగంగా ప్లాస్టిక్ వినియోగం వల్ల కలిగే అనర్థాలపై మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ సుందర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి సుబ్బారెడ్డి, కో ఆర్డినేటర్ ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యానికి చిరుధాన్యాలు శ్రేయస్కరం: ఈవోపీఆర్డీ

వినుకొండ టౌన్, సెప్టెంబరు 24: పట్టణంలోని ఏ సెక్టార్ పరిధిలోని పోలేరమ్మ గుడి వద్ద ఉన్న అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహార మాసోత్సవాలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో వినుకొండ మండల ఈవోపీఆర్డీ సుందర్‌రెడ్డి, సూపర్‌వైజర్ శేషుకుమారి, అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఏఎంరెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో స్వచ్ఛత హీ సేవ

నరసరావుపేట టౌన్, సెప్టెంబరు 24: స్థానిక ఏఎంరెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో స్వచ్ఛత హీ సేవ కార్యక్రమం మంగవారం రెండోరోజు నిర్వహించారని సెక్రటరీ ఆట్లూరి శాంతి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆఫీసర్ డాక్టర్ కే.కృష్ణారెడ్డి, విద్యార్థులు కళాశాల ప్రాంగణంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ మల్లికార్జున, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి కబడ్డీ పోటీలకు సీతారామ్‌పురం స్కూల్ విద్యార్థులు

నూజెండ్ల, సెప్టెంబరు 24: మండలంలోని సీతారామ్‌పురం శ్రీవెంకటేశ్వరస్వామి కమిటీ హైస్కూల్ విద్యార్థులు జిల్లా కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల హెచ్ఎం ఎస్ కామేశ్వరరావు శర్మ మంగళవారం తెలిపారు. అండర్-17 కబడ్డీ బాలికల విభాగంలో గోపిశెట్టి లక్ష్మీప్రసన్న, ధూపాటి శ్రావణి, అండర్-14 బాలికల విభాగంలో గుమ్మా లోకేశ్వరి, బాలుర విభాగంలో బొడ్డపాటి ప్రవీణ్‌కుమార్‌లు జిల్లాస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికయ్యారు.

చెకుముకి సైన్స్ సంబరాల గోడపత్రికల ఆవిష్కరణ

శావల్యాపురం, సెప్టెంబరు 24: జనవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలలలో ఈ నెల 25వ తేదీన ప్రారంభం కానున్న చెకుముకి సైన్స్ సంబరాలు 2024 గోడపత్రికలను శావల్యాపురంలోని ఎంఆర్సీ కార్యాలయంలో జనవిజ్ఞానవేదిక సభ్యులు, ఎంఈవో మద్దిగుంట్ల సాంబశివరావు మంగళవారం ఆవిష్కరించారు. ఈ నెల 25న పాఠశాల స్థాయిలో, అక్టోబర్ 1న మండలస్థాయిలో, అక్టోబరు 27న జిల్లాస్థాయిలో, నవంబరు 10, 11 తేదీలలో రాష్ట్రస్థాయిలో చెకుముకి సైన్స్‌సంబరాలు జరుగుతాయన్నారు.

విశ్రాంత ఉపాధ్యాయుడు రమేష్‌కు జాషువా అవార్డు

వినుకొండ, సెప్టెంబరు 24: వినుకొండ పట్టణానికి చెందిన కవి కేజే రమేష్ గుర్రం జాషువా అవార్డుకు ఎంపికైనట్లు మంగళవారం ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 26 తేదీన గుంటూరులో దళిత రచయితల సంఘం ఆధ్వర్యంలో గుర్రం జాషువా 129వ జయంతి కార్యక్రమంలో ఈ అవార్డును ఇవ్వనున్నట్లు తెలిపారు.

ఓపెన్ స్కూల్‌ను సద్వినియోగం చేసుకోవాలి: అక్తర్‌అలీ

శావల్యాపురం, సెప్టెంబరు 24: పాఠశాల మానేసి తిరిగి చదువుకోవాలనుకునే విద్యార్థులకోసం ఓపెన్ స్కూల్‌ను ప్రభుత్వం ప్రారంభించిందని, దీనిని సద్వినియోగం చేసుకోవాలని ఓపెన్ స్కూల్ రాష్ట్ర సమన్వయకర్త అక్బర్ అలీ అన్నారు. ఈ పోస్టర్లను శావల్యాపురం జడ్పీ పాఠశాలలో మంగళవారం ఆయన ఆవిష్కరించారు.

హైదరాబాద్ ఓఆర్ఆర్‌పై రోడ్డు ప్రమాదం

● యడ్లపాడు మండలానికి చెందిన ఇద్దరు మృతి



సురేష్, రాఘవరావు (ఫైల్ ఫొటో)

యడ్లపాడు, సెప్టెంబరు 24: తెలంగాణ రాష్ట్ర రాజధాని ఔటర్ రింగ్ రోడ్డుపై జరిగిన రోడ్డు ప్రమాదంలో పల్నాడు జిల్లాకు చెందిన ఇద్దరు దుర్మరణం చెందగా, మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. ఘటనకు సంబంధించి బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. యడ్లపాడు మండలం ఉన్నవ గ్రామానికి చెందిన ఇడుపలపాటి సురేష్ (36), సామినేని రాఘవరావు (44), ముక్తా రమేష్, కాకుమాను అమ్మయ్యలు ఈ నెల 22న నిజామాబాద్‌కు కారులో బయలుదేరి వెళ్ళారు. నిజామాబాద్ పెదగుట్ట గ్రామం వద్ద తనకు గల పొలాన్ని సురేష్ 20 రోజుల క్రితం నిజామాబాద్‌కు చెందిన వారికి విక్రయించాడు. విక్రయ దనంలో కొంత రావలసి ఉండగా ఆ మొత్తాన్ని తెచ్చుకునేందుకు నిజామాబాద్ వెళ్లారు. నిజామాబాద్‌లో పనులు ముగించుకుని సోమవారం సాయంత్రం 7గంటలకు హైదరాబాద్ మీదుగా స్వగ్రామానికి బయలుదేరారు. అర్ధరాత్రి 2.30-3.00 గంటల మధ్య ఔటర్ రింగ్ రోడ్డుపై ఘట్‌కేసర్ సమీపంలో కారు అదుపుతప్పి ముందు వెళుతున్న లారీని వెనుక నుంచి బలంగా ఢీకొట్టింది. దీనితో సురేష్, రాఘవరావులు అక్కడికక్కడే మృతిచెందగా రమేష్, అమ్మయ్యలు తీవ్రంగా గాయపడ్డారు. కారు పైకప్పు లేచిపోవడంతోపాటు నుజ్జునుజ్జయింది. గాయపడిన వారిని చికిత్స నిమిత్తం సమీపంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. సురేష్‌కు భార్య సునీత ఓ కుమారుడు, కుమార్తె ఉండగా, రాఘవరావుకు భార్య పూర్ణిమ, కుమార్తె, కుమారుడు ఉన్నారు. సురేష్, రాఘవరావులు మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.